Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03





నెల్లూరు, 10.05.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 49 పేజీలు : 12, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# మసకబారుతున్న చంద్రుడు



- ఓటమి భయంతో వక్రమార్గం పడుతున్న సీనియర్
- అనవసర రాద్ధాంతంతో పాతాళానికి పడిన ప్రతిష్ట
- 40ఏళ్ళ అనుభవం అంటే ఇదేనా అని విస్తుపోతున్న విశ్లేషకులు

ఇటీవలే 'ఫాని' తుఫాన్ ఉత్తరాంధ్ర జిల్లాలను పలుకరించి, ఒడిస్సాను వణికించింది. ఈ తుఫాన్ పరిస్థితుల్లోనే ఎన్నికల కోడ్ అమలులో లేకపోయివుంటే పరిస్థితి ఎలా వుండేది! సీఎం చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లాలో మకాం వేసి, 5కోట్ల విలువ చేసే బస్సులో తుఫాన్ బాధితుల కోసం నిద్రపోయేవాడు. కూలిన చెట్లను ఆయనే ఎత్తేవాడు. విరిగిన స్థంభాలను స్వయంగా పక్కకు జరిపేవాడు. తుఫాన్ బాధితులకు కోట్ల రూపాయల విలువ చేసే మజ్జిగ ప్యాకెట్లను, పాల ప్యాకెట్లను పంపిణీ చేసేవాడు. అనుకూల ఛానల్స్ ఈ కథనాలను టీవీ సీరియల్స్ ఎపిసోడ్‌ల మాదిరిగా ప్రసారం చేసేవి. అనుకూల పత్రికలు సెంటర్‌స్ప్రెడ్‌లో తుఫాన్‌ను తన్ని తరిమేసిన చంద్రుడు, అభినవ ఇంద్రుడు... అనే హెడ్డింగ్‌లతో ఫోటోలతో నింపేవి. తుఫాన్ నష్టం అంచనా వేలకోట్లలో వుండేది. అవినీతి సొమ్ము కోసం అధికార పార్టీల వాళ్ళు శవాల మీద రాబందుల్లా వాలేవాళ్ళు. తుఫాన్‌పై చంద్రబాబు విజయం... అంటూ అన్ని జిల్లాల్లో మంత్రులు, తెలుగుదేశం నాయకులు భారీ ర్యాలీలు, విజయోత్సవాలు నిర్వహించి వందలకోట్లు తగలేసి వుండేవాళ్ళు.

ఒకసారి తుఫాన్ వచ్చిందంటే ఇంతగా ఆర్భాటం చేయాలని చంద్రబాబు హుద్‌హుద్, గజ, తిత్లి వంటి తుఫాన్‌ల ద్వారా నిరూపించాడు. కాని 'ఫాని' తుఫాన్‌కు అటువంటి అదృష్టం లేకుండా పోయింది. 'ఫాని' టైంకు ఎన్నికల కోడ్ మూలంగా చంద్రబాబు డమ్మీగా మారి చీఫ్‌సెక్రటరీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం సర్వాధికారియై వున్నాడు. చడీచప్పుడు కాకుండా తుఫాన్ సహాయక చర్యలు చేపట్టాడు. అన్ని శాఖల అధికారులు కూడా ఎవరి పనులు వాళ్ళు పద్ధతిగా చేసుకున్నారు. హంగామా లేదు, ప్రచారార్భాటాలు లేవు, ఫోటోలకు ఫోజులు

(మిగతా 11వ పేజీలో)



## జాతీయ స్థాయిలో...

# తెలుగు పార్టీలకు వెలుగు

> రేపటి ఢిల్లీ పాలనలో తెలుగు రాష్ట్రాలకు పెద్దపీట

ఈ నెల 23న ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన పార్టీలు కీలకపాత్ర పోషించబోతున్నాయా? 1999లో ఎన్డీఏ ప్రభుత్వంలో తెలుగుదేశం కీలకపాత్ర పోషించింది. 2004, 2009 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్

(మిగతా 11వ పేజీలో)



స్వర్గీయ శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ

నెల్లూరు జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు

## అమ్మకు అశ్రునివాళి

అమ్మే దైవం... అమ్మే జీవం
అమ్మే దీపం.. అమ్మే అమృత రూపం
అమ్మను మించిన అద్భుతం లేదు...
అమ్మను మించిన దైవం లేదు.

ఈ నెల 10వ తేదీన ఆ అమృతమూర్తి
తృతీయ వర్ధంతి సందర్భంగా
**అమ్మను స్మరించుకుంటూ....**

కుమారుడు
**పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి**
**నెల్లూరు.**

నెల్లూరంటేనే.. 'నెల్లు' (వడ్లు) ఊరు. ధాన్యపు రాశులకు ప్రసిద్ధి చెందిన ఊరు. అందులోనూ ముక్కారు..(ఏడాదికి మూడు కార్లు) పండే నేల ఇది. ఎక్కడ చూసినా పచ్చపచ్చని వరి పొలాలతో కళకళలాడే జిల్లా ఇది. పాడిపంటలకు పుట్టినిల్లుగా నెల్లూరు ప్రఖ్యాతి చెందింది. అయితే, ఇదంతా గతం. ఒకప్పుడు గాదెల్లో ధాన్యం నిండి రైతుల కుటుంబాలు కళకళలాడితే, ఇప్పుడు కళ్ళల్లో దైన్యం నిండి అన్నదాతల బతుకులు విలవిల్లాడుతున్నాయి. అదేమి కర్మో ఏమో గానీ..గత నాలుగేళ్ళుగా జిల్లాలో వానలు కురవడం లేదు. ఎప్పుడైనా వచ్చినట్లున్నా నామమాత్రమే. వస్తే గిస్తే..అకాల వర్షాలే తప్ప అదునుకు సరైన వానల్లేవు.

ఫలితంగా పంటపొలాలకు సాగునీరు కరువైపోయింది. అంతేకాదు, భూగర్భజలాలు అడుగంటిపోవడంతో అనేక గ్రామాల్లో జనానికి గుక్కెడు మంచినీళ్ళు దొరకాలన్నా కష్టంగానే ఉంది. మరోవైపు మండువేసవి మండిపోతోంది. జిల్లాలో కరువు కరాళనృత్యం చేస్తున్నా అటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కానీ, జిల్లా అధికారులు కానీ పట్టించుకోకపోవడం దారుణం!..



# ముక్కారు పండే నేల..
# ఎడారిగా మారిపోతోంది

- అదునుకు వానలు లేవు... సమయానికి సాగునీళ్ళు రావు
- కష్టాల్లో రైతులు... కన్నెత్తి చూడని ప్రభుత్వాలు

జిల్లాలో కరువు తాండవిస్తోంది. తీవ్ర వర్షాభావం ఒకవైపు, భగభగలాడే ఎండలు మరోవైపు... ప్రభుత్వాల నిర్లక్ష్యం ఇంకోవైపు... ఈ ముప్పేట దాడితో గత నాలుగేళ్ళుగా జిల్లాలో రైతాంగం కుదేలై పోతోంది. ఇప్పుడు వ్యవసాయ సీజన్ సమీపిస్తున్నా పంటలు వేసుకోవాలంటే అదునుకు వానలు వస్తాయో లేదో తెలియదు. ఇప్పటికే వానలు లేక బావులు, చెరువులు దొరువులన్నీ ఎండిపోయాయి. వాగులు వంకల్లో.. కాలువల్లో ఎక్కడా చుక్క నీళ్ళు లేవు. సోమశిల, కనిగిరి రిజర్వాయర్లలో కూడా నీళ్ళు అడుగంటి పోయాయి. దీంతో రైతులు రానున్న ఖరీఫ్ పంటలకు నీళ్లొదులుకోవాల్సిన దుర్గతి కనిపిస్తోంది. గత మూడేళ్ళుగా ఇదే దుస్థితి. ఎప్పుడూ వ్యవసాయ సీజన్లలో అదునుకు పదునైన వర్షాలు కురుస్తూ, ముక్కారు పంటలతో కళకళలాడే జిల్లా.. ఇప్పుడు మామూలు వానలకే ముఖం వాచిపోయింది. నీలిమబ్బులు అప్పుడప్పుడూ ఊరిస్తూ కనిపిస్తుంటాయి కానీ, వానచుక్కలు మాత్రం రాలడం లేదు. అదునుకు సరైన వానలు కురవకపోవడంతో వ్యవసాయం బాగా దెబ్బతినిపోతోంది. దీంతో రైతులు, రైతు కుటుంబాల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో సాధారణంగా ఒకటిన్నర లక్షల ఎకరాల దాకా పంటలు పండుతాయి. ఈసారి సాగునీరు కొరతతో పంట విరామం ప్రకటించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత రబీ సీజన్లో వర్షాలు బాగా కురవకపోయినా కృష్ణాజలాలతో కొంతమేరకు కష్టాలు తీరాయి. ఇప్పుడా పరిస్థితి కూడా లేదు. 75 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న సోమశిల రిజర్వాయర్లో ఇప్పుడు కేవలం నాలుగు టిఎంసిల నీళ్ళే ఉన్నాయి. దీంతో పంటలే కాదు, జలాశయం పక్కనున్న గ్రామాలకు తాగేందుకు చుక్క మంచినీళ్ళు కూడా దొరకని స్థితి ఏర్పడుతోంది. చివరికి పాడిపశువులు.. మూగజీవాలకు కూడా తాగునీరందించలేని దుస్థితి. జిల్లాలో పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నా అటు అధికారగణం కానీ, ఇటు ప్రభుత్వాలు కానీ సాగునీటి కొరత తీర్చేందుకు చర్యలు తీసుకోకపోవడం పట్ల రైతాంగంలో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది.

## ఎండిపోయిన చెరువులు.. అడుగంటిన జలాశయాలు...

గత ఏడాది ఇదే రోజుల్లో సోమశిల జలాశయంలో 13 టిఎంసిల నీరుంటే, ఇప్పుడు పైతట్టు ప్రాంతాల నుంచి కూడా నీళ్ళు రాకపోవడంతో కేవలం 3.610 టిఎంసిల నీళ్ళే ఉన్నాయి. సోమశిల జలాశయంలో ఇప్పుడుండే కొద్ది నీళ్ళు రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు కూడా చాలవని, ఈ పరిస్థితుల్లో రైతులు రెండో పంట వేసుకోకుండా ఉంటేనే మేలని అధికారులు సలహా ఇస్తున్నారు. కండలేరులో 5.942 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. కనిగిరి రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయింది. గతంలో ఈ రిజర్వాయర్ నీటితో కనీసం లక్షా యాభైవేల ఎకరాలకు పైగానే రబీ సీజన్లోనూ, లక్ష ఎకరాల దాకా ఖరీఫ్ సీజన్లోనూ పంటలు పండేవి. ఇప్పుడిక్కడ చుక్క నీరు లేకపోవడంతో రైతులు రెండో పంటమీద ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. ఉదయగిరి నియోజకవర్గంలోనూ అంతే. అంతంతమాత్రంగా ఉన్న గండిపాళెం ప్రాజెక్ట్ ఎప్పుడో ఎండిపోయింది. గత నాలుగేళ్ళుగా వర్షాలు లేకపోవడంతో ఈ ప్రాజెక్ట్ కింద ఉన్న పొలాలన్నీ బీడుపడిపోయాయి.

## కరువు సాయం మాట.. ఉత్తుత్తిదేనా?...

వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలోని అన్ని మండలాలు కరువుకు గురికావడంతో ప్రభుత్వం గత ఏడాది కరువు జిల్లాగా ప్రకటించింది. అన్ని మండలాల దయనీయస్థితిని కేంద్రప్రభుత్వ బృందాలు కూడా గభగభా పరిశీలించి వెళ్ళాయి. అయినా, ఇప్పటి దాకా కరువు రైతులకు ఎలాంటి సాయం అందలేదు. కరువుతో పంటలు నష్టపోయిన రైతన్నలకు అటు కేంద్రం గానీ, ఇటు రాష్ట్రం కానీ దమ్మిడీ ఇచ్చిన దాఖలా లేదు. కరువు సాయం మాట ఉత్తుత్తిదేనా అని రైతులు నిరాశపడుతున్నారు. వానలు రాక, ఎవరి సాయం లేక దిగులుతో రైతులు క్రుంగిపోతున్నారు. ప్రభుత్వాలు, అధికారులు ఇకనైనా ఈ దుస్థితి గమనించి జిల్లాలో రెండో పంటకు సాగునీరందించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలి. రిజర్వాయర్లకు వెంటనే కృష్ణాజలాలు తరలించడమో లేదా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా జిల్లాకు నీరందించడమో చేయాలని రైతులు కోరుకుంటున్నారు.



## మా గొర్రెల్ని - మేకల్ని ఎవరో పట్టుకుపోతున్నారు

------------ లబోదిబోమంటున్న కొమ్మరపూడి బాధితులు

నెల్లూరు రూరల్ మండలంలోని కొమ్మరపూడి గ్రామానికి చెందిన గొర్రెలు, మేకలు అపహరణకు గురవుతున్నాయని వాటి యజమానులు లబోదిబోమంటున్నారు. అయితే వాటిని ఎవరు, ఎప్పుడు పట్టుకుపోతున్నారో తెలియడం లేదని, మేత కోసం వాటిని దొంతాలి అడవుల్లోకి తోలుకొనివెళ్తుండగా మందలోనుంచి కొన్ని మూగజీవాలు అదృశ్యమయ్యాయని, నెల్లూరు-పొదలకూరు రహదారిలో గుర్తుతెలియని వ్యక్తులెవరో వాటిని ఆటోల్లో వేసుకుని దొంగిలించుకుపోతున్నట్లు తమకు అనుమానంగా ఉందని బాధితులు పేర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా ఇదే తంతు కొనసాగుతోందని, పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఆ మాయదారి ముఠా ఆటలు కట్టించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుకుంటున్నారు.

## లక్ష విరాళమిచ్చిన బండి వేణుగోపాల్‌రెడ్డి

**ఆలయాల కోసం రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుని వితరణ**

ఆలయాల నిర్మాణం కోసమని రాష్ట్ర రెడ్డి సంక్షేమసంఘం అధ్యక్షుడు బండి వేణుగోపాల్‌రెడ్డి లక్ష రూపాయలు విరాళమిచ్చి తన వితరణగుణాన్ని చాటుకున్నారు. రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద నిర్మిస్తున్న మహావిష్ణు, అయ్యప్పస్వామి మందిరాల నిర్మాణానికిగాను ఈ విరాళాన్ని ఆయన ఆలయ కమిటీ సభ్యులకు ఈనెల 5న అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు తిలక్‌రెడ్డి, గోపీచంద్, వెంకటరత్నం, పాలవల్లి హరనాథ్, వెలుగోటి శ్రీనివాసులురెడ్డి, రెడ్డి సంక్షేమసంఘం సభ్యుడు మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో...
## బీయస్ఎన్ఎల్ 4జీ సర్వీసులు

నెల్లూరు జిల్లా నాయుడుపేటలో తొలిసారిగా బీయస్ ఎన్ ఎల్ 4 జీ సర్వీసులను ప్రారంభించినట్లు బీయస్ ఎన్ ఎల్ పీజీయం మేరువ రవిబాబు తెలిపారు. ఈనెల 3న నాయుడుపేట బీయస్ ఎన్ ఎల్ ఎక్స్ఛేంజిలో 4 జీ సర్వీసులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఉన్న 3జీ సర్వీసులను 4జీ సర్వీసులుగా సేవలు పొందవచ్చన్నారు. గతంలో 3 జీకి 4 ఎంబీపీయస్ ఇంటర్నెట్ స్పీడ్ వుండగా, 4జీకి 8ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ పనిచేస్తుందన్నారు. మొదటగా 4జీ సర్వీసులు 6 సెల్ టవర్ల పరిధిలో పనిచేస్తుందన్నారు. జిల్లాలో 314(2జీ) సెల్‌టవర్లు, 247(3జీ) సెల్ టవర్లు ఉన్నాయన్నారు. త్వరలో అన్నింటిని 4జీ సెల్ టవర్లుగా ఆధునీకరిస్తామన్నారు. జిల్లాలో 32 వేల ల్యాండ్ లైన్లు 9200 బ్రాడ్‌బ్యాండ్లు, 1030 భారత్ ఫైబర్ నెట్ కనెక్షన్లకు సేవలు అందిస్తున్నామన్నారు. బీయస్ ఎన్ ఎల్ ప్రవేశపెట్టిన వింగ్స్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో ల్యాండ్‌లైన్, సిమ్ కార్డులు లేకపోయినప్పటికి భారతదేశంలోని ఏ నెట్ వర్క్ అయినా ఏ దేశాల్లో అయినా అపరిమితంగా మాట్లాడుకోవచ్చన్నారు. వింగ్స్ ద్వారా 10 అంకె యూనిక్ నెంబర్ ఇస్తామని, ఆ నెంబరుతో కాల్స్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అందుకోసం రిజిస్ట్రేషన్ చార్జీలు సంవత్సరానికి రూ.1099, జీఎస్టీ ఒక్క సంవత్సరం మాత్రమే చెల్లించాల్సి వుంటుందన్నారు. ఈ అవకాశం స్మార్ట్ ఫోన్, ల్యాప్ టాప్, ట్యాబ్, పీసీల నుంచి వినియోగించుకోవచ్చన్నారు. బీయస్ ఎన్ ఎల్ డీజీఎం బీవీ ప్రసాదరావు, సెల్‌వన్ డీజీఎం వీ.కృష్ణమూర్తి, గూడూరు డీఈకే నాగరాజు, సూళ్ళూరుపేట డీఈ ఐ. అంకయ్య, సెల్ వన్ డీఈ డీ.శ్రీనివాసరావు, సెల్‌వన్ ఎస్‌డీఇ ఆర్.అశోక్, నాయుడుపేట డీఈ ఎం.రామారావు, రాజగోపాల్ పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయస్వామికి నారికేళ జలాభిషేకం

సూళ్ళూరుపేటలోని చిత్రకూటంలో ఉన్న శ్రీ బాలాంజనేయ స్వామికి ఈనెల 4న నారికేళ జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అమావాస్య, మరోవైపు కత్తెర కార్తె ప్రారంభాలను పురస్కరించుకుని లోకకల్యాణం కోసం శ్రీ ఆంజనేయస్వామివారికి ఈ విశేషపూజలు చేశారు. నేత్రపర్వంగా 108 కొబ్బరిబోండాల జలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు దివి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నేత్రపర్వంగా జరిగిన ఈ వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

## వానలు కురవాలంటూ..
## గ్రామదేవతలకు ప్రత్యేకపూజలు

వానలు బాగా కురవాలని, పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని కోరుకుంటూ మనుబోలు గ్రామస్తులు గ్రామదేవతలైన మనుబోలమ్మ, నాగార్పమ్మ దేవతలకు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈనెల 5న ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను అందంగా అలంకరించారు. అర్చకుడు మనోజ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో గ్రామదేవతలకు పంచామృతాభిషేకాలు చేశారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. సలిపిండి, పానకాలను నైవేద్యంగా సమర్పించుకున్నారు.

## ఇన్నర్‌వీల్ ఉచిత వైద్యశిబిరం

గూడూరు పట్టణంలోని షిర్డీసాయి నగర్‌లోని సాయి మందిరంలో ఈనెల 5న ఇన్నర్‌వీల్‌క్లబ్, ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అనేకమంది పట్టణ ప్రజలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

# పెద్దాయనను స్మరించుకున్నారు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చేవూరు దేవకుమార్‌రెడ్డి, టి.బాలసుధాకర్ తదితరులు

దివంగత మాజీముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 5వ వర్ధంతిని పురస్కరించుకుని 9వ తేదీ నెల్లూరు ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ కుటుంబంతో అత్యంత సన్నిహితంగా మెలిగిన నాయకుడు జనార్ధన్‌రెడ్డేనన్నారు. 1972లో రాజ్యసభ సభ్యుడి నుండి ముఖ్యమంత్రి దాకా ఆయన ఎన్నో పదవులు నిర్వహించారని, పదవులకే వన్నె తెచ్చారని అన్నారు. రైతులకు పాస్‌బుక్‌ల విధానం తెచ్చింది ఆయనేనని చెప్పారు.

ఈ సందర్భంగా నేదురుమల్లి ఫౌండేషన్ సభ్యులు టి.బాలసుధాకర్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు భవానీ నాగేంద్రప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావ్, ఫయాజ్, పి.కోటేశ్వరరెడ్డి, ఏ.రాంప్రసాద్, మల్లి, నవీన్‌బాబు, ఏసునాయుడు, హుస్సేన్ బాషా, సురేష్‌బాబు, శ్రీనివాసులురెడ్డి, కొండా అనిల్‌కుమార్, అనూరాధ, లత, సాల్మాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో తమిళ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు



చెన్నైలోని తమిళ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ)కు చెందిన 12మంది ప్రతినిధుల బృందం, టీసీసీ ప్రెసిడెంట్ చోళ నాచ్చియార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీసిటీని సందర్శించింది. వీరికి శ్రీసిటీ ఫౌండేషన్ అధ్యక్షులు రమేష్ సుబ్రమణ్యం స్వాగతం పలికి, ఇక్కడ ప్రపంచశ్రేణి మౌళిక వసతులు, ప్రత్యేకతలు, వ్యాపార అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, అమలవుతున్న సులభతర వ్యాపారాంశాల గురించి వివరించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా శ్రీసిటీలో అందుబాటులో వున్న రెడీ బిల్ట్ ఫ్యాక్టరీలు, ప్లాట్లు గురించి తెలియచేశారు. మెగా పారిశ్రామికవాడ అభివృద్ధి పట్ల శ్రీసిటీ యాజమాన్య చర్యలను అభినందించిన రాజశేఖర్, ఇక్కడ ప్రపంచ స్థాయి వసతులు, స్నేహపూర్వక వ్యాపార వాతావరణం తమను ఎంతగానో ఆకర్షించాయన్నారు.

కాగా, ప్రముఖ వ్యాపారసంస్థలు, పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు ఈ సందర్శనలో పాల్గొన్నారు. శ్రీసిటీ మౌళిక వసతులు, వ్యాపార అవకాశాలతో పాటు పరిశ్రమల ఏర్పాటు పరిశీలన వీరి పర్యటన ముఖ్య ఉద్దేశ్యం. దీనిపై శ్రీసిటీ అధికారులతో చర్చలు జరిపి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. చర్చల అనంతరం వారు శ్రీసిటీ పరిసరాలను చుట్టిచూడడంతో పాటు కొబెల్కో, ఆల్ స్టామ్ ఉత్పత్తి కేంద్రాలను సందర్శించారు. టీసీసీ సభ్యత్వ కూటమిలో తమిళనాడు మరియు ఇతర ప్రాంతాల చిన్న పరిశ్రమలు, వర్తక రంగ ప్రతినిధులు వున్నారు. హస్తకళలు, వాణిజ్య విద్యను ప్రోత్సహించేందుకు ఈ చాంబర్ వార్షిక అవార్డులు అందచేస్తుంది. ఇంకా వ్యాపార పర్యటనలు, సమావేశాలు, సెమినార్లను టీసీసీ నిర్వహిస్తుంది.


## జిల్లా ప్రజలు...

# అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్పీ ఐశ్వర్య రస్తోగి**



ఈ వేసవికాలంలో దొంగలు ఇదే అదనుగా దొంగతనాలకు పాల్పడుతుంటారని, కనుక జిల్లాలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి సూచించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగలు ధరించి ఎవరూ ఇళ్ళ బయట, ఆరుబయట మిద్దెలపైనా నిద్రించవద్దని, ఇళ్ళ తలుపులు తెరిచేసి ఇళ్ళలో నిద్రపోకూడదని, తలుపులు భద్రంగా వేసుకోవాలని తెలిపారు. బంగారు వస్తువులకు మెరుగుపెడతామంటూ వచ్చేవారిని నమ్మవద్దన్నారు. అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బస్సులు, ఆటోల్లో ప్రయాణించేటప్పుడు బ్యాగుల్లో పర్సులు పెట్టుకుంటే అవి చోరీకి గురయ్యే అవకాశం ఉంటుందని, ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా అపరిచితులు ఏవైనా తినుబండారాలు ఇస్తే తినకూడదని హెచ్చరించారు. ద్విచక్రవాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేసుకోవాలని, ఇళ్ళకు సెంట్రల్ లాక్ సిస్టమ్ గల తాళం అమర్చుకోవడం మంచిదని అన్నారు. పట్టణాల్లో నివసించేవారు లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను అమలుచేసుకుంటే మంచిదని సూచించారు.

## ‘ప్రభా’తం

# అనవసర రాద్ధాంతం

మన దేశంలో రాజకీయాలు చిత్రంగా ఉంటాయి. ఉన్నదాన్ని లేనట్లుగా, లేనిదాన్ని ఉన్నట్లుగా భ్రమింపజేసి, తిమ్మిని బమ్మిని చేసే రాజకీయనాయకులకు మనదేశంలో కొదవలేదు. ఊరుకుంటే ఊరా పేరా.. ఏదో ఒకటి చేస్తే పోలా.. అనే సామెతను నిజం చేస్తూ మన నాయకులు కొంతమంది ఎప్పుడూ పేపరులో పేరుకొరకు అన్నట్లుగా... ఏదో ఒక రాద్ధాంతంతో కాలం గడుపుతుంటారు.

మనది ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య దేశం. పార్లమెంటరీ వ్యవస్థ, న్యాయవ్యవస్థ, ఎన్నికల వ్యవస్థ, పత్రికా వ్యవస్థ వంటి అత్యున్నతమైన వ్యవస్థల వల్లనే ప్రజాస్వామ్యం నిలబడుతూ ఉందనేది అందరికీ తెలిసిందే. అయితే, అలాంటి వ్యవస్థల పట్ల విశ్వసనీయత కోల్పోయేలా కొంతమంది నాయకులు మాట్లాడుతుండడం చూస్తే ఔరా.. అనిపిస్తుంది. మనది ప్రజాస్వామ్య దేశం కదా.. భావప్రకటనా స్వాతంత్ర్యం ఉంది కనుక..ఏమైనా మాట్లాడవచ్చు అనే విపరీత ధోరణితో ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం చేసేవిధంగా విపక్షనాయకులు సైతం ప్రవర్తించడం ఎంతైనా విచారకరం. అందులోనూ, ఇప్పుడు ఈ ఎన్నికల రోజుల్లో.. ఒకవైపు ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఎన్నికలు జరుగుతుండగా.. మరోవైపు ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠగా ఉండగా.. విపక్షాలు అదేపనిగా ఈవిఎంలు, వివి ప్యాట్ల లెక్కింపుకు సంబంధించి మరింత గందర గోళాన్ని అందరి నెత్తిమీద రుద్దుతుండడం విచిత్రం. మొన్నటికి మొన్న ఈవిఎంలు, వివిప్యాట్ల వ్యవహారానికి సంబంధించి సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు చెప్పినా, ఆ తీర్పును గౌరవిస్తున్నామంటూనే మరో వైపు ఆ వ్యవహారాలకి సంబంధించి నిరాధారమైన ఆరోపణలకు దిగడం ఏమిటో అర్థం కాదు. పోలింగ్‌కు వినియోగిస్తున్న ఇవిఎంలలో 50 శాతం వాటికి అనుసంధానించే వివిప్యాట్లలోని రసీదులతో పోల్చి చూడాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. అయితే, అందుకు సమయం వృధా అవుతుందని, ఒక్కో అసెంబ్లీ స్థానంలో అయిదు ఇవిఎంల వంతున లెక్కిస్తే సరిపోతుందని సుప్రీంకోర్టు గతనెలలోనే తీర్పు చెప్పింది కూడా. అయితే ఆ తీర్పువల్ల తమకు న్యాయం జరగలేదని భావిస్తే అందుకు సహేతుకమైన వివరాలను కోర్టుకు నివేదించి ఉండాల్సింది కానీ అలా చేయకపోగా మరికొద్ది రోజుల్లోనే ఓట్ల లెక్కింపు ఫలితాలు వెలువడి విజేతలెవరో తేలిపోనున్న దశలో ఈవిఎంల పనితీరుపై లేనిపోని సందేహాలను లేవనెత్తుతూ అనవసర రాద్ధాంతం చేయడం వల్ల ప్రయోజనం ఏముంటుందీ?..

ఓట్ల లెక్కింపు సమయంలో 50 శాతం వివిప్యాట్లను లెక్కించాలన్నది విపక్షాల కోరిక. ఆ మేరకు ఓట్ల లెక్కింపు సందర్భంగా మరిన్ని వివిప్యాట్లలోని స్లిప్పులను లెక్కించాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో సహా 21 పార్టీల నేతలు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను తాజాగా సుప్రీంకోర్టు తోసిపుచ్చడం ఒకవిధంగా విపక్షాలకు భంగపాటే అనుకోవచ్చు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అయిదు పోలింగ్ కేంద్రాల్లోని వివిప్యాట్‌లను లెక్కిస్తే సరిపోతుందంటూ గత నెల 8న ఇచ్చిన ఆదేశాలను మార్పుచేయడానికి సుప్రీంకోర్టు అంగీకరించలేదు. గతనెలలో ఇచ్చిన ఆదేశాలను మార్చేది లేదని స్పష్టం చేసింది. అయినా.. దేశంలో సుమారు 90 కోట్ల మందిదాకా ఓటర్లున్నారు. దాదాపు 10 లక్షల పోలింగ్ కేంద్రాలు పెట్టి, అందుకు అవసరమైన ఈవిఎంలను, సిబ్బందిని అంతా సిద్ధం చేసింది ఎన్నికల కమిషన్. ఇలా దేశ వ్యాప్తంగా లక్షలాది పోలింగ్ కేంద్రాలు, ఈవిఎంలు ఉన్నప్పుడు ఎక్కడో ఒకచోట ఏదోఒక సాంకేతిక పరమైన సమస్యో, లేకపోతే పొరపాటు వల్లనో తప్పులు జరిగే అవకాశం లేకపోలేదు. అంతమాత్రాన వ్యవస్థ అంతటినీ తప్పు పట్టలేం. ఒకవేళ ఎక్కడైనా పొరపాటు జరిగినట్లు ఫిర్యాదులొస్తే వెంటనే ఎన్నికల యంత్రాంగం రంగంలోకి దిగి పొరపాట్లను సరిదిద్దుతోంది కూడా. ఇవిఎంలలోనో, వివి ప్యాట్లలోనో ఏమైనా అనుమానాలుంటే నిజాయితీగా ఎవరైనా అడగవచ్చు. పొరపాట్లను సరిదిద్దేలా చేసుకోవచ్చు. అయినా ఇక్కడొక విచిత్రమేమంటే మా ఓటు గల్లంతైందనో, ఒకరికి ఓటేస్తే మరొకరికి వెళ్ళిపోయిందనో కోటానుకోట్లుగా ఉన్న ఓటర్ల నుంచి కానీ, దేశవ్యాప్తంగా పోటీచేసిన అభ్యర్థుల నుంచి కానీ ఎలాంటి ఫిర్యాదులూ లేవు. కానీ రాజకీయనాయకులు మాత్రం దీన్నొక ప్రచార అంశంగా భావించి రాద్ధాంతం చేస్తున్నట్లు ఎవరికైనా అనిపిస్తుంది.

ఓట్ల లెక్కింపు సమయంలో 50 శాతం వివిప్యాట్లను లెక్కించాలన్నది విపక్షాల కోరిక. ఆ మేరకు పలుపార్టీల నాయకులు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను తాజాగా సుప్రీంకోర్టు తోసిపుచ్చడం ఒకవిధంగా విపక్షాలకు భంగపాటే. అయినా, గెలిస్తే మా గొప్ప, ఓడిపోతే ఈవిఎంల తప్పిదమనే నాయకుల ధోరణి మంచిది కాదు. నాయకులు మన వ్యవస్థలను మనం గౌరవించుకుంటూ, పొరపాట్లేమైనా ఉంటే సరిదిద్దాలే తప్ప, రచ్చ చేసి రాజకీయం చేయాలని చూడడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు!

పోలింగ్‌కు ముందు ఈవిఎంలను పరిశీలించుకునేందుకు రాజకీయపార్టీల ప్రతినిధులకు అవకాశం ఇచ్చారు కదా!.. అప్పుడంతా గమ్మగానే ఉన్న నాయకులు కొంతమంది ఇప్పుడు తగుదునమ్మా అంటూ అంతా అయిపోయాక ఈవిఎంల పనితీరు బాగా లేదంటూ వాటిమీద పడడంలో అర్థం లేదు. తప్పులేమైనా ఉంటే సరిదిద్దడానికి ఎన్నికల కమిషన్ సిద్ధంగా ఉన్నా, కేవలం నిరాధారమైన ఆరోపణలతోనే కాలం గడపడం ఎందుకు?.. వివిప్యాట్లలో లోపాలున్నాయని తేలితే అప్పుడేమి చేయాలంటూ ఇప్పుడు రచ్చకెక్కుతున్నారు. అయితే, తాము గెలిస్తే మాత్రం తమ గొప్ప అని, ఓడితే అది ఈవిఎంల దోషమని ప్రకటించుకోవడం నాయకులకు అలవాటే. గతంలో ఇలాంటివెన్నో చూశాం. తాము ఓడిపోతే అందుకు ఈవిఎంలే కారణమంటూ ప్రధాన పార్టీలు కూడా ప్రకటించుకోవడం మరొక విచిత్రం. గెలిచినప్పుడు ఊరకుండి, ఓడిపోయినప్పుడు ఈవిఎంలు సరిగా లేవని సమస్యని పక్కదారి పట్టించడంలో కాంగ్రెస్, టిడిపిలతో పాటు బిజెపి కూడా ఆ వరుసలోనే ఉండడం మరో విశేషం. ఏదేమైనా, ఇలాంటి అనవసర రాద్ధాంతాల వల్ల ఆయా పార్టీలకు, లేదా నాయకులకు అప్రదిష్టే మిగులుతుంది. మన ప్రజాస్వామ్యాన్ని మనం గౌరవించుకోవడం వల్ల మనల్ని మనమే గౌరవించుకున్నట్లవుతుంది. అంతే తప్ప మన వ్యవస్థల్ని మనమే విమర్శించుకుంటూ లేనిపోని అభాండాలను మనమే వేసుకుంటూ పోతే ఇతరులకు చులకన అవుతామే తప్ప ప్రత్యేకించి సాధించేదేమీ వుండదు. విజ్ఞులు, అనుభవజ్ఞులైన నాయకులకు ఇవన్నీ తెలియవని అనుకోలేం!..రాజకీయాల కోసం రాజకీయాలు చేయవచ్చు కానీ, అత్యున్నత వ్యవస్థలను కూడా రాజకీయం చేయడం తగదు. అలా చేయడం వల్ల ఆశించిన ఫలితాలు రాకపోగా మనమే వెలితిపడతాం!....

### ప్రపంచ సాహిత్యంలో...

# తెలుగు కవిత్వానికి విశిష్టస్థానం

**----------- ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం**



బుక్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న కథా రచయిత ఖదీర్‌బాబు, ఎమ్మెల్సీ విఠపు

ప్రపంచ సాహిత్యంలో తెలుగుభాషకు, ప్రత్యేకించి తెలుగు కథకు, తెలుగు కవిత్వానికి విశిష్టస్థానం ఉందని, దానిని కాపాడుకుంటూ ముందుకు నడిపించాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని ప్రముఖ సాహితీవేత్త, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఈ నెల 5న నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం కూడలిలో ఏర్పాటుచేసిన ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, అన్ని భాషలతో పాటు తెలుగుభాష కూడా ప్రపంచస్థాయిలో తన గౌరవస్థానాన్ని నిలబెట్టుకుంటూనే ఉందని అంటూ, పుస్తకాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తొలుత ఈ బుక్‌హౌస్‌ను ప్రారంభించిన ప్రముఖ కథా రచయిత ఖదీర్‌బాబు మాట్లాడుతూ దువ్వూరి రామిరెడ్డి, పట్టాభి, శేషేంద్రశర్మ వంటి ఎందరో ప్రఖ్యాతిచెందిన కవులు, రచయితలకు సింహపురిసీమ పేరుగాంచినదన్నారు. ఈ బుక్‌హౌస్ నెల్లూరీయుల ఆదరాభిమానాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. చలంచర్ల భాస్కరరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డా.కాళిదాసు పురుషోత్తం, పాతూరి అన్నపూర్ణ, డాక్టర్ అజయ్‌కుమార్, ఈతకోట సుబ్బారావు, గోవిందరాజుల సుభద్రాదేవి, అవ్వారు శ్రీధర బాబు, లక్ష్మయ్య, క్రాంతికిరణ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.




## చెట్లు పెంచండి

నానాటికీ ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. ప్రకృతి సమతుల్యం దెబ్బతింటోంది. మనిషి స్వార్థంతో అడవులు హరించుకుపోతున్నాయి. సకాలంలో వర్షాలు కురవడం లేదు. పల్లెలు సైతం కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయి. ఇళ్లల్లో సైతం చెట్లు పెంచడం లేదు. ఒకప్పుడు అందరి ఇళ్ళల్లో వేప, జామ, మామిడి వంటి చెట్లుండేవి. ఇప్పుడు ‘లాన్’ల పేరుతో లక్షలు ఖర్చుపెట్టి ఎందుకూ కొరగాని గడ్డిని పెంచుతున్నారు. చెట్లను పెంచడం, అడవులను కాపాడడం వల్లే ఉష్ణోగ్రతలను తగ్గించగలం. చెట్లను కాపాడడం, చెట్లను నాటడం ఒక ఉద్యమంలాగా చేపట్టాలి.

**పేదూరు సతీష్, నెల్లూరు.**

## చరిత్ర తెలుసుకో సీతారాం...

హిందువులు హింసోన్మాదులని, రామాయణం, మహాభారతం అంతా హింసేనని సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి చెప్పడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనం. రామాయణంలో అయినా, మహాభారతంలో అయినా దుష్టశిక్షణ, శిష్ట రక్షణ అనే దానికే ప్రాధాన్యత ఏర్పడింది. చరిత్రలో హిందువులు ఇతర రాజ్యాల మీద దండయాత్రలు చేయడం, ఇతర మతస్తులను చంపి వారి సంస్కృతిని నాశనం చేయడం వంటి సంఘటనలు లేవు. విదేశీ దురాక్రమణదారుల హింసకు బలైపోయింది హిందువులే! వారి దాడులకు దెబ్బతిన్నది హిందూ సంస్కృతే! మతం పేరుతో ఎవరు హింసకు పాల్పడుతున్నారో ఇప్పటికీ చూస్తున్నాం. సీతారాం ఏచూరిలాంటి మూర్ఖులకు హిందువులంటే మరీ అంత కసి ఎందుకో?

**సి.రాజీవి, నెల్లూరు.**

## శెభాష్ సి.ఎస్

‘ఫొణి’ తుఫాన్‌ను ఎదుర్కోవడంలో రాష్ట్ర అధికార యంత్రాంగం చూపిన సమర్థత అభినందనీయం. ముఖ్యంగా చీఫ్ సెక్రటరీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా తుఫాన్ ముందస్తు చర్యలను బ్రహ్మాండంగా చేపట్టారు. అధికారుల చేత తుఫాన్ బాధిత ప్రాంతాలలో ప్రశాంతంగా పని చేయించారు. కేంద్రం ఇచ్చిన నిధులను దారిమళ్ళకుండా చేసి బాధితులకే ఉపయోగపడేలా చేశారు. అధికారులకు స్వేచ్ఛనిస్తే, వారి పనిని వారిని చేసుకోనిస్తే వాళ్ళు ఎంత సమర్థవంతంగా సేవలందిస్తారో నేడు ఎల్.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అధికారులు చూపిస్తున్నారు.

***బి.వి.నాగరాజు, రాజోలు.***

## తీర్పు స్పష్టం - జగన్‌కే పట్టం

రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తీర్పు స్పష్టంగా వుంది. ప్రజలు వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి పట్టం కట్టారు. రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో 125 అసెంబ్లీ సీట్లు వైసిపి గెలిచి జగన్మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యం. రాష్ట్రంలోని శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు చిత్తూరు నుండి కర్నూలు వరకు జగన్మోహన్‌రెడ్డి ప్రభంజనం వీచింది. తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్ని తప్పుడు హామీలు ఇచ్చినా, మాయమాటలు చెప్పినా ప్రజలు విశ్వసించలేదు. పోలింగ్‌బూత్‌ల వద్ద యువకులు, మహిళలు, వృద్ధులు బారులు తీరి ఓట్లు వేయడం జగన్ విజయానికి సంకేతం. జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలు, నెల్లూరు, తిరుపతి ఎంపి స్థానాల్లో వైసిపి విజయం సాధిస్తుంది. జగన్మోహన్‌రెడ్డి జనరంజక పాలన కోసం ఈ రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తూ ఈ ఎన్నికల్లో జగన్ ముఖ్యమంత్రి కావాలని స్పష్టమైన తీర్పునిచ్చారు. చంద్రబాబుకు విశ్రాంతి తప్పదు.

***డా॥ యస్.బాబురావు, కావలి.***

## • సర్వేపల్లి

# ఆరాటమొకరిది.. ఆఖరిపోరాటమొకరిది!




జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలుంటే... తెలుగుదేశం గెలవడానికి అవకాశం వుంది అని ఎక్కువ మంది నోట వినిపిస్తున్న మొదటి నియోజకవర్గం సర్వేపల్లి. తెలుగుదేశం అభ్యర్థిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వరుసగా ఆరోసారి బరిలో నిలిచాడు. 1994, 1999లలో ఈ నియోజకవర్గం నుండి గెలిచిన ఆయన 2004, 2009, 2014 ఎన్నికల్లో వరుసగా ఓటములలో హ్యాట్రిక్ కొట్టాడు. ఇంకోసారి ఓటమిని ఎదుర్కోవడానికి మనిషి, తట్టుకోవడానికి మనసు సిద్ధంగా లేదు. అందుకే ఇవే తన రాజకీయ ఆఖరిపోరాటం అన్నట్లుగా పోరాడాడు. ఇంకోసారి ఓడిపోవడం అంటూ జరిగితే ఆయన రాజకీయ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ఎందుకంటే ఒకే నియోజకవర్గం నుండి వరుసగా ఇన్ని ఓటమములు ఎదురైన ప్రధాన పార్టీల నాయకులు ఇంకెవరూ వుండరు. గెలుపే లక్ష్యంగా ఆయన ఏం చేయాలో అంతా చేశాడు. 2014లో ఓడిపోయినా కూడా సర్వేపల్లి ప్రజలతోనే వున్నాడు. ఎమ్మెల్సీగా ఆ తర్వాత మంత్రిగా ఈ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశాడు. ఐదేళ్లుగా ఈ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో పర్యటించాడు. సమస్యలు తీర్చాడు. తాగునీళ్ళు, సాగునీళ్ళ పనులకు ప్రాధాన్యతనిచ్చి పని చేశాడు. మొన్న ఎలక్షన్‌లలో జీవన్మరణ సమస్యగా పని చేశాడు. ఖర్చుల విషయంలో కూడా కక్కుర్తి చూపకుండా ధారాళంగా వ్యవహరించాడు.

ఇక వైసిపి అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి వరుసగా రెండోసారి పోటీలో వున్నాడు. 2014లో జడ్పీఛైర్మెన్‌గా ఆయనకు అత్యంత క్రేజ్ వుండింది. సర్వేపల్లి నుండి పాతికవేలతో గెలుస్తాడనే ప్రచారం నడిచింది. అయితే మీనమేషాలు లెక్కించి ఆలస్యంగా సర్వేపల్లి నుండి టిడిపి అభ్యర్థిగా దిగిన సోమిరెడ్డి చాలా పకడ్బందీగా ఎలక్షన్ చేయడంతో పాతిక వేలతో గెలుస్తాడనుకున్న కాకాణి చివరకు 5వేలతో బయటపడ్డాడు. కాకాణికి అప్పుడున్నంత ఇమేజ్ ఇప్పుడు లేదు. కాకపోతే ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరడం జిల్లాలో అందరు వైసిపి అభ్యర్థులకంటే కూడా కాకాణికే బాగా కలిసొచ్చిందని చెప్పొచ్చు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఆనం వర్గీయులు వైసిపిలో బాగానే చేరారు. ప్రభుత్వ వ్యతిరేకత అన్ని చోట్లలాగే ఇక్కడా పనిచేస్తుంది. ఇక జగన్ ప్రజాదరణ కాకాణికి కలిసిరావాలి.

జిల్లాలోని మిగతా 9నియోజకవర్గాలకు సర్వేపల్లికి ఒక చిన్న తేడా వుంది. మిగతా అన్ని చోట్ల జగన్‌కు ఒక్క అవకాశం ఇద్దాం అనే ప్యాట్రన్ పనిచేసుండొచ్చు. ఈ కోవలోనే సర్వేపల్లిలో పాపం మూడుసార్లు ఓడిపోయాడు కాబట్టి ఈ ఒక్కసారి సోమిరెడ్డికి ఓటేద్దాం అనే ఆలోచన ఓటర్లపై ప్రభావితం చేసివుండొచ్చని భావిస్తున్నారు. ఇది పనిచేస్తే సోమిరెడ్డి గెలుపు సులభమే. సోమిరెడ్డి సెంటిమెంట్‌కన్నా జగన్ సెంటిమెంటే బలంగా పనిచేస్తే ఆయన గెలుపు కష్టమే! ప్రత్యేకించి ఈ ఒక్కసారికి సోమిరెడ్డికి ఓటేద్దాం అనే భావన ప్రజల్లో పనిచేసుండాలి. జగన్ అభిమానాన్ని కూడా అది దాటిపోవాలి... అప్పుడే తెలుగుదేశం సాంప్రదాయ ఓట్లతో పాటు అన్ని వర్గాల వారి ఓట్లతో సోమిరెడ్డికి ఛాన్స్ వుంటుంది.

తెలుగుదేశం వాళ్ళ లెక్క ప్రకారం పొదలకూరు, టి.పి.గూడూరు మండలాలలో ఎవరికీ పెద్దగా మెజార్టీ రాదని, ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు మండలాలలో 5 నుండి 10వేల మధ్య మెజార్టీతో తాము గెలవబోతున్నామని ధీమాగా వున్నారు. వైసిపి వాళ్ళు కూడా జగన్ గాలిపై ధైర్యంగా వున్నారు. పొదలకూరు, టి.పి.గూడూరు, ముత్తుకూరు మండలాలలోనే 10 నుండి 13వేల మెజార్టీని వీళ్ళు ఆశిస్తున్నారు. మనుబోలు, వెంకటాచలం మండలాలలో ఎవరికీ పెద్దగా మెజార్టీ రాదని, ఒకవేళ టిడిపికి వచ్చినా ఈ రెండు మండలాలలో మెజార్టీ రెండు మూడు వేలకు మించదని, ఎటు చూసినా గెలుపు తమదేనని ధైర్యంగా చెబుతున్నారు.

# కౌంటింగ్ ట్రైనింగ్‌లో కలెక్టర్, జేసీ




ఈ నెల 7వ తేదీన అమరావతిలో జరిగిన కౌంటింగ్ శిక్షణకు నెల్లూరు పార్లమెంట్ ఎన్నికల అధికారిగా కలెక్టర్ ముత్యాలరాజు, తిరుపతి పార్లమెంట్ ఎన్నికల అధికారిగా జాయింట్‌కలెక్టర్ వెట్రిసెల్వీలు హాజరయ్యారు. వీరితో పాటు మరో ఇద్దరు సాంకేతిక నిపుణులు కూడా జిల్లా నుండి వెళ్ళారు. రాష్ట్ర ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

## • నెల్లూరు రూరల్

# అద్భుతాలకు ఆస్కారం లేనట్లే!




ఎన్నికలకు ముందు నెల్లూరుజిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అత్యంత బలంగా వున్న నియోజకవర్గం నెల్లూరురూరల్. 2009లో ఈ నియోజకవర్గం ఏర్పడింది. 2009, 2014 రెండు ఎన్నికల్లోనూ తెలుగుదేశం పోటీ చేయకపోవడంతో ఆ పార్టీ కేడర్ ఇక్కడ బలహీనంగానే వుండేది. మరోవైపు వైకాపా స్థానిక నాయకత్వం, సిటింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నిత్యం ప్రజల మధ్యలో వున్న కారణంగా వైసిపి ఇక్కడ బలోపేతం అయ్యింది. ఈ నియోజకవర్గంలో వైకాపా ఎంత బలంగా వుందని ప్రచారం వచ్చిందంటే... టీడీపీ నుండి ఇక్కడ పోటీ చేసేందుకు నాయకులే జంకే పరిస్థితి కనపడింది.

అలాంటి నియోజకవర్గం నుండి టిడిపి అభ్యర్థిగా మేయర్ అబ్దుల్ అజీజ్ పోటీకి దిగడం జరిగింది. ఆయన అనేక నాటకీయ పరిణామాల మధ్య రంగంలోకి దిగాడు. ఆయన నామినేషన్ వేసేటప్పటికి గెలుపుపై ఎలాంటి నమ్మకాలు లేవు. కేవలం సీటిచ్చారు కాబట్టి పోటీ చేస్తే అసెంబ్లీ ఎలక్షన్ చేసిన అనుభవం అన్నా వుంటుందనే ఉద్దేశ్యంతో నిలబడ్డాడు. ఎన్నికలకు పదిరోజుల ముందు రూరల్ నియోజకవర్గ పరిధిలో చోటు చేసుకున్న మార్పులతో అజీజ్‌కు గెలుపుపై ఆశ ఏర్పడింది. ముఖ్యంగా ముస్లింలు ఎక్కువుగా అజీజ్‌వైపు మొగ్గుచూపారు. టిడిపి కేడర్ కొంతవరకు బాగానే పని చేసింది. అసలు ఆశలే లేని రూరల్‌లో టిడిపికి ఎక్కడో ఆశలు మొలకెత్తాయి. దీనికితోడు జనసేన అభ్యర్థి మనుక్రాంత్ చెన్నారెడ్డి రూపంలో వైసిపి ఓట్లు కొన్ని చీలి వుంటాయేమోనని కూడా ప్రచారం జరుగుతోంది.

అయితే ఈ పరిణామాలన్నీ కూడా వైసిపి మెజార్టీని తగ్గించగలవేమోగాని వైసిపి అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గెలుపును అడ్డుకోలేవని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

## స్థానిక
# సన్నాహాల్లో నేతలు



***అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇంకా రాలేదు. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో తెలియదు. పట్టణాలలో, గ్రామాలలో స్థానిక ఎన్నికల హడావిడి మొదలైంది. పార్లమెంట్, అసెంబ్లీల కంటే కూడా గ్రామాలలో కిక్కు ఎక్కించేవి స్థానిక ఎన్నికలే!***

ఈ నెల 23న కౌంటింగ్ తర్వాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. మా పార్టీయే అధికారంలోకి వస్తుందని అటు అధికార తెలుగుదేశం, ఇటు ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలు ధీమాగా వున్నాయి. తమ పార్టీ అధికారంలోకి వస్తే స్థానిక ఎన్నికల్లో ఎవరు ఎక్కడ పోటీ చేయాలన్నదానిపై అప్పుడే స్థానిక నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు.

జిల్లాలో నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, ఆత్మకూరు మున్సిపాల్టీలు, నాయుడుపేట నగర పంచాయితీలున్నాయి. వీటిలో డివిజన్‌లు, వార్డు రిజర్వేషన్ల ఎంపిక జరగాలి. మేయర్ రిజర్వేషన్, మున్సిపల్ ఛైర్మెన్‌ల రిజర్వేషన్ తేలాలి. నిన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఇరు పార్టీల అభ్యర్థుల కోసం పనిచేసిన ద్వితీయశ్రేణి నాయకులు చాలామంది ఈ పదవులపై ఆశలు పెంచుకుని వున్నారు. అట్లాగే ఈ డివిజన్‌లో మేం పోటీ చేస్తాం, ఈ వార్డు నాకు కావాలి అంటూ అప్పుడే చిన్న నాయకులు నిన్న పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో 46 జడ్పీటీసీలు, 46 ఎంపీపీలు, ఇక ఎంపీటీసీలు, 900కుపైగా పంచాయితీలకు సర్పంచ్‌లను ఎన్నుకునే పని కూడా వుంది. డివిజన్‌లు, వార్డులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పంచాయితీలు... పంచాయితీ వార్డు మెంబర్‌లు... దాదాపు 5వేలకు పైగానే పదవులు నిండబోతున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులకు ఇక పదవుల జాతరే!

**ఏ పార్టీ అధికారంలోకి వస్తే... ఆ పార్టీ నాయకులకు పదవుల జాతరే!**




# నెల్లూరు కబుర్లు

### ఈ ఏడాది...
## రంజాన్ ఇఫ్తార్‌లు ఎవరికో?



ఈ నెల 6వ తేదీన నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం మొదలైంది. ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాసదీక్షలు మొదలుపెట్టారు. ఈ ఏడాది రంజాన్ ప్రత్యేకత ఏంటంటే... మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఎవరెవరు ఇఫ్తార్ విందులకు హాజరు అవుతారని! రంజాన్ మాసం ముగిసే వారం రోజులు ముందు నుండి ఇఫ్తార్ విందులు ఎక్కువగా జరుగుతుంటుంటాయి. ఈ నెల 23వ తేదీన కౌంటింగ్ జరుగుతుంది. ఆ తర్వాత వారం రోజుల్లోపే కొత్త ప్రభుత్వం, కొత్త మంత్రివర్గం ఏర్పడవచ్చు. జిల్లాలో ఎమ్మెల్యేలుగా గెలిచినవాళ్ళు, కొత్తగా మంత్రి లేదా మంత్రులైనవాళ్ళు తమ కొత్త రాజకీయ ప్రయాణాన్ని ఈసారి ఇఫ్తార్ విందులతో మొదలుపెట్టే అవకాశముంది.

## దామోదరం సంజీవయ్యకు నివాళి



సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏఐసిసి మాజీఅధ్యక్షుడు, తొలి దళిత ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య 47వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీన నెల్లూరు ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవయ్య వ్యక్తిత్వాన్ని ఆయన రాజకీయ ప్రస్థానం గురించి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావ్, షేక్ ఫయాజ్, చిలకా శ్రీనివాసులు, టి.బాలసుధాకర్, ఏ.రాంప్రసాద్, ఏటూరి శ్రీనివాసులురెడ్డి, కొండా అనిల్‌కుమార్, షేక్ హుస్సేన్‌బాషా, షేక్ మున్నా, షేక్ మస్తాన్‌బాషా, లతారెడ్డి, అనురాధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిబిఎస్ఇలో విరిసిన రెయిన్‌బో



శ్రీరంగ సుగోహితను అభినందిస్తున్న రెయిన్‌బో యాజమాన్యం

ఈ నెల 6వ తేదీన సిబిఎస్ఇ ఫలితాలలో నెల్లూరులోని రెయిన్‌బో సిబిఎస్ఇ విద్యార్థులు తమ సత్తాను చాటారు. మొత్తం 88 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఈ స్కూల్ నుండి చుందూరి శ్రీరంగ సుగోహిత 500 మార్కులకుగాను 489(97.8%) మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. అలాగే ఐ.వి.చైతన్యరెడ్డి 483(96.6%), కంచి వైష్ణవి 482(96%) మార్కులతో తమ విద్యాసంస్థ కీర్తిని నిలబెట్టారు. ఈ స్కూల్ నుండి 18మంది 90శాతానికి పైగా మార్కులతో, 25మంది 80శాతంపైగా మార్కులతో, 29మంది 70శాతం పైగా మార్కులతో, 16మంది 60శాతంకుపైగా మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. రెయిన్‌బో స్కూల్ డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్, డాక్టర్ కె.ప్రతాప్‌రాజ్, వైస్‌ప్రిన్సిపాల్స్ హరితారెడ్డి, సురేఖారెడ్డి తదితరులు విద్యార్థులను అభినందించారు.

## జడ్పీ సమావేశం

జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని జడ్పీ సి.ఇ.ఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో వున్నందున విధానపరమైన అంశాలపై కాకుండా సాధారణ అంశాలపై చర్చ జరుగుతుందని, జడ్పీ సభ్యులు, అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

## పర్యాటక కాలేజీలో ప్రవేశాలు

గొలగమూడిలో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖచే నెలకొల్పబడిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ (ఐఐటిటిఎం) కళాశాలలో 2019-20 సంవత్సరానికి అడ్మిషన్లు మొదలుపెట్టినట్లు కళాశాల కమిటి సభ్యుడు ప్రొఫెసర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన దీనికి సంబంధించి వివరాలను వెల్లడించారు. బిబిఏ కోర్సు కాలవ్యవధి మూడేళ్ళు, ఇంటర్మీడియట్ 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై 22ఏళ్ళలోపు వయసున్నోళ్ళు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 45శాతం మార్కులతో పాసై వుంటే చాలు. అలాగే ఎంబిఏ కోర్సు కాలవ్యవధి రెండేళ్ళు. ఏదైనా డిగ్రీ 50శాతం మార్కులతో పాసైవుండాలి. ఎస్సీ ఎస్టీలైతే 45శాతం మార్కులు దాటుండాలి. ఈ నెల 17వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలి. వివరాలకు 98662 78850, 9490764454 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## మీ ఇళ్ళకు మేం కాపలా!

### - నగర డిఎస్పీ



వేసవికాలంలో విహారయాత్రలకు వెళ్ళేవాళ్ళు తమ ఇళ్లలోని విలువైన వస్తువులను దొంగల బారిన పడకుండా కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగర డిఎస్పీ ఎన్‌బిఎం మురళీకృష్ణ కోరారు. ఇటీవల నగరంలోని ఇళ్ళ భద్రత గురించి ఆయన విలేకరులతో మాట్లాడుతూ విహారయాత్రలకు వెళ్ళేవాళ్ళు హౌస్ లాక్ మానిటరింగ్ సిస్టమ్ (హెచ్‌ఎల్‌ఎంఎస్)ను ఉపయోగించుకోవాలని, దీనివల్ల సిసి కెమెరాల నిఘాలో సంబంధిత గృహముంటుందని, దీనివల్ల నేరాలు తగ్గడమేకాక, నిందితులను తొందరగా పట్టుకోవడానికి అవకాశముంటుందన్నారు. నగరంలోని ఆరు పోలీసుస్టేషన్‌ల పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, రాత్రి గస్తీలు ముమ్మరం చేసామని పేర్కొన్నారు. వేసవికాలంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉండడంతో ప్రత్యేకబందోబస్తును ఏర్పాటు చేసినట్లు డిఎస్పీ తెలిపారు.

### జెఇఇ మెయిన్స్‌లో
## సత్తా చాటిన 'నారాయణ' విద్యార్థిని
### ■ రోషన్ ఆరాకు 19వ ర్యాంకు ■

ఎంతో ప్రతిష్టాత్మకమైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు తన సత్తా చాటుకున్నాయి. నెల్లూరు నగరంలోని ఆచారివీధిలో ఉన్న నారాయణ మహిళా క్యాంపస్ విద్యార్థిని ఎస్‌కె రోషన్ ఆరా జాతీయస్థాయిలో 19వ ర్యాంకు సాధించి తన ప్రతిభను నిరూపించుకుంది. ఈ సందర్భంగా ఈనెల 4న ఏర్పాటుచేసిన అభినందనసభలో ఆ కళాశాల డిజిఎం కె.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తమ క్యాంపస్ విద్యార్థిని జెఇఇ మెయిన్స్‌లో అత్యుత్తమ ర్యాంకును సాధించడం తమకెంతో సంతోషంగా ఉందంటూ ఆ విద్యార్థినిని అభినందించారు. రోషన్‌తో పాటు పలువురు విద్యార్థినులు కూడా ఉత్తమ ర్యాంకులు సాధించి అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని పేర్కొంటూ ఆ విద్యార్థినులందరినీ అభినందించారు.

# క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఫ్రెండ్స్ వాకర్స్ సభ్యులు

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు ఆధ్వర్యంలో ఈనెల 6 న శిక్షణ పొందుతున్న క్రీడాకారులు వెయ్యిమందికి కేకు, పుచ్చకాయ జ్యూస్, అరటిపండ్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అంతర్జాతీయ సంస్థ నాయకులు యంవి సుబ్బారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, జాలీవాకర్ సోను, వీరిశెట్టి హజరత్‌బాబు, నరసయ్య, దొడ్ల జయరామానాయుడు, మాగంటి ప్రసాద్, కార్యవర్గసభ్యులు చెంచయ్య నాయుడు, శివయ్య, ఎన్.సాయి సుబ్బారావు, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిలారి తిరుపతినాయుడు, పాబోలు సత్యం, వేలూరు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణచైతన్యలో...
## 'జియో' ప్రాంగణ ఎంపికలు



నెల్లూరు నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 4న జియో ప్రతినిధులతో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలో 150 మంది విద్యార్థులు పాల్గొనగా, అందులో 66 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు డా.ఆర్.వి.కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ గతంలో కూడా తమ కళాశాలలో అనేక కంపెనీల వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారని, విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ అర్హతకు కావాల్సిన స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను తమ కళాశాలలో అందిస్తున్నామని, ఇప్పటిదాకా మొత్తం 527 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కోసం ఎలాంటి రుసుములు లేకుండా ఉచితంగా అందిస్తున్న ఏకైక సంస్థ కృష్ణచైతన్య విద్యాసంస్థలేనని అన్నారు. కళాశాల డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్ యన్.కృష్ణకుమార్, వైస్‌ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

### సీబీఎస్ఈ ఫలితాల్లో
## సత్తాచాటిన జీవీకె విద్యార్థులు

జీవీకె చిన్మయ విద్యాలయం విద్యార్థులు సీబీయస్ఈ పదవ తరగతి ఫలితాల్లో సత్తాచాటారు. విద్యాలయంలోని మొత్తం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో పాటు ముగ్గురు విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారని కరస్పాండెంట్ గీర్వాణి, ప్రిన్సిపల్ అజిత్ ఠాగూర్ ఈనెల 6న తెలిపారు. ఎస్ ఎస్ యల్ ప్రవల్లిక 93.5 శాతం, వై తేజస్వినీ 93శాతం, యస్‌కె మహ్మద్‌ఇక్రం 91శాతం మార్కులు సాధించారని వివరించారు. 20 మంది విద్యార్థులు 75శాతానికిపైగా, 9మంది విద్యార్థులు 60 శాతానికి పైగా మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా మార్గనిర్దేశనం చేసిన బోధనా సిబ్బంది, వారికి సహకారం అందించిన తల్లిదండ్రులకు కరస్పాండెంట్, ప్రిన్సిపల్ అభినందనలు తెలిపారు.

## జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ ఔదార్యం

నెల్లూరు జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్, ట్రేడ్ వారి ఆధ్వర్యంలో ఈనెల 6న 55 మంది పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతినెలా పేదలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డీ.లక్ష్మీనారాయణ, మంచికంటి శ్రీనివాసులు, వెలుగొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశాకు నెల్లూరుజిల్లా విద్యుత్ సిబ్బంది

ఇటీవల ఫణీ తుఫానుతో అతలాకుతలమైన ఒడిశా రాష్ట్రంలో దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పునరుద్ధరించేందుకు నెల్లూరు జిల్లా విద్యుత్ సిబ్బంది ఈనెల 6 న బయలుదేరి వెళ్ళారు. ఏపీఎస్పీడీసీయల్ సీఎండి ఎంఎం నాయక్ ఆదేశాల మేరకు నెల్లూరు డివిజన్‌కు చెందిన 60 మంది విద్యుత్ సిబ్బంది బయలుదేరి వెళ్ళారు. నెల్లూరు ఈస్ట్-1 ఏఈ రమేష్‌బాబు నేతృత్వంలో ఒడిశాలోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యల్లో పాల్గొననున్నారు.

# అంతరించిపోతున్న పచ్చదనం

నెల్లూరుజిల్లాలో ఇప్పుడు కాస్తున్న ఎండలు గతంలో ఎప్పుడూ లేవు. ఏ ఏడాదికాఏడాది ఎండలు మండుతూనేవున్నాయి. ఒకప్పుడు పల్లెల్లో పచ్చదనం నిండుగా వుండేది. ప్రతి వీధిలో, ప్రతి ఇంటిలో ఏపుగా పెరిగిన చెట్లుండేవి. ఎండా కాలంలో ఎండలు అదరకాసినప్పటికి సాయంత్రమైతే ఆరుబయట చల్లటి గాలుల మధ్య మంచాలు వేసుకుని జనం హాయిగా నిద్రపోయేవాళ్ళు. ఇప్పుడు గ్రామాలలో సైతం పచ్చదనం కరువవుతోంది. చెట్లను నరికేస్తున్నారు. పల్లెటూర్లను సైతం ఏసిలు ఆక్రమించేస్తున్నాయి. ఆరు బయట మంచాలేసుకుని పైరుగాలిని పీలుస్తూ నిద్రపోయే వాతావరణమే లేకుండాపోయింది. పల్లెటూర్లలో కూడా తాటాకు ఇళ్ళు లేవు. అన్నీ కాంక్రీట్ భవనాలే.

పల్లెల్లోనే పరిస్థితులు ఇలా మారితే, ఇక పట్టణాలలో ఎలా వుంటుందో వేరే చెప్పాలా? సమాజంలో వచ్చిన వ్యాపారాత్మక ధోరణులు పర్యావరణానికి పచ్చదనానికి చేటుగా మారాయి. ముఖ్యంగా భూములకు రేట్లు పెరగడం అన్నది ఒకరకంగా రైతుకు మేలు చేసేది అయితే, ఇంకోరకంగా సమాజానికి హానికరంగా మారుతోంది. భూమి ఇప్పుడు పెద్ద వ్యాపార వస్తువు. పచ్చటి పొలాలన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్‌లవుతున్నాయి. రియల్ వ్యాపారం కోసం ఏళ్ళ తరబడి పెంచిన చెట్లను కూడా నిలువునా నరికేయాల్సివస్తోంది. రియల్ ఎస్టేట్ సంస్కృతి ఎంత ప్రమాదకరంగా మారిందంటే... ఒక్క అంకణం స్థలం కూడా పచ్చదనం కోసం వదలకుండా మొత్తం కాంక్రీట్ మయంగా మారుతోంది. ఒకప్పుడు పట్టణాలలో అయినా, గ్రామాలలో అయినా విశాల స్థలాలలో ఇళ్లుండేవి.

## మనిషి మనుగడకే ప్రమాదకరం

"తన భద్రత కోరుకునేవాడు కుక్కను పెంచుతాడు... సమాజం బాగుండాలనుకునేవాడు మొక్కను పెంచుతాడు". నిజమే ఒక కుక్కను పెంచితే నాలుగైదేళ్ళు మనకు కాపలా కాస్తుందేమో... అదే మొక్కను పెంచితే తరతరాలకు నీడనిస్తుంది. ఫలాలనిస్తుంది. మంచి ప్రాణవాయువునిస్తుంది. చెట్టు విలువ తెలియని మనిషి ఆ చెట్టు విలువను కేవలం దానిని నరికి కలపగా మారిస్తే వచ్చే సంపాదనే దాని విలువగా భావిస్తున్నాడు. భూమిపై చెట్టు లేకపోతే ప్రకృతి లేదు... పచ్చదనం లేదు... ప్రాణవాయువు లేదు... మనిషి మనుగడే లేదు.



ఇల్లు చిన్నదిగా వుంటే, ఆవరణలో మంచి నీడనిచ్చే పెద్దపెద్ద చెట్లుండేవి. ఇప్పుడు అలాంటి ఇళ్ళు, అలాంటి వాతావరణం కనిపించడం లేదు. మనిషి ఆలోచన పూర్తిగా కమర్షియల్‌గా మారిపోయింది. గతంలో వంద అంకణాల స్థలంంలో పాతిక అంకణాలలో ఇల్లు కట్టుకుని, మిగతా 75 అంకణాల స్థలంలో వేప, మామిడి, సపోటా, జామ, టెంకాయ వంటి చెట్లు వేస్తుండేవాళ్ళు. ఇప్పుడు కమర్షియల్ దృక్పథం పెరిగి 25అంకణాలలో వున్న ఇంటితో పాటు 75అంకణాల స్థలంలో వున్న చెట్లను కూడా నిలువునా తొలగించేసి వంద అంకణాలలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, లేదంటే అపార్ట్‌మెంట్లు కట్టేస్తున్నారు. చెట్ల పెంపకానికి పది అంకణాలు కూడా వదలడం లేదు.

నగరాలు, గ్రామాలు ఈ విధంగా కాంక్రీట్ జంగిల్స్‌గా తయారవుతున్నాయి. జిల్లాలో పరిశ్రమలు పెరుగుతుండడం, కాలుష్యం కూడా ఉష్ణోగ్రతలు పెరగడానికి ఒక కారణంగా భావిస్తున్నారు. నిజమేకావచ్చు. కాని పారిశ్రామికాభివృద్ధి అన్నది నిరంతరం జరిగే ప్రక్రియ. ఉష్ణోగ్రతలను ఎదుర్కోవడానికి మనం చేయాల్సింది వస్తున్న పరిశ్రమలను వద్దనడం కాదు... చెట్లను పెంచడం... మొక్కలు నాటడం. పెద్ద వృక్షాలను కూల్చకుండా కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా తీసుకోవాలి. రోడ్ల విస్తరణలో కొన్ని వేల వృక్షాలను నరుకుతున్నారు. ఒక చెట్టును కూలిస్తే దాని బదులు నాలుగు చెట్లు పెంచే విధంగా ప్రజల్లో చైతన్యం కలుగజేయాలి. చెట్ల పెంపకం, చెట్ల రక్షణ ఒక ఉద్యమంలా వస్తేనే భవిష్యత్‌లో అయినా ఈ పెరుగుతున్న ఎండల నుండి కాస్తా ఉపశమమనం పొందగలం.



# రీపోలింగ్ ప్రశాంతం

- అటకానితిప్ప, ఇస్కపల్లిలో తగ్గిన పోలింగ్
- ఓటింగ్‌కు రాని బయట ప్రాంతాల వారు

ఈవిఎంల మొరాయింపు, అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఈ నెల 6వ తేదీన జిల్లాలో రెండుచోట్ల జరిగిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సూళ్లూరుపేట నియోజకవర్గం అటకానితిప్ప 197 పోలింగ్ కేంద్రంలో, అలాగే కోవూరు నియోజకవర్గం ఇస్కపల్లి 41 పోలింగ్ కేంద్రంలో రీపోలింగ్ నిర్వహించారు. అటకానితిప్ప పోలింగ్ కేంద్రంలో మొత్తం 558 ఓట్లకుగాను 470 ఓట్లు పోలయ్యాయి. ఏప్రిల్ 11వ తేదీన జరిగిన పోలింగ్‌లో మొత్తం 500 ఓట్లు పోల్‌కాగా, రీపోలింగ్‌లో 30ఓట్లు తగ్గాయి. అలాగే ఇస్కపల్లి బూత్‌లో 1084 ఓట్లకు గాను 819 ఓట్లు పోలయ్యాయి. ఏప్రిల్ 11న జరిగిన పోలింగ్‌లో 831 ఓట్లు పోల్ అయ్యాయి. అంటే ఇక్కడా 12ఓట్లు తగ్గాయి. ఈ గ్రామాలకు చెందిన బయట ప్రాంతాలలో వున్నోళ్ళు రీపోలింగ్ కోసం ప్రత్యేకంగా రాకపోవడంతో ఈ ఓట్లు తగ్గినట్లుగా తెలుస్తోంది. రెండుచోట్ల కూడా పార్లమెంట్‌కే ఎన్నికలు జరిగాయి.

ఈ రెండు పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్ నిర్వహణ కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ రెండు కేంద్రాలలో రీపోలింగ్‌కే ఖర్చు తడిసి మోపెడయ్యింటుంది.

# వైద్యులంతా వేళకు రావాలి

## - అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యులు ఉదయం 9 నుంచి నిర్ణీత సమయం వరకు విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలంటూ జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ నెల 4న కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మాసాల్లో డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఒక నోడల్ అధికారిని నియమించి ప్రైవేటు ఆసుపత్రుల నుండి డేటాను సేకరించుకోవాలన్నారు. క్లినికల్ ల్యాబ్ యాజమాన్యాలు మెడికల్ రిపోర్టులు ఇచ్చే విషయంలో తగు జాగ్రత్తలు పాటించేలా చూడాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. త్వరలో ప్రతి సబ్ సెంటర్‌ను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఆకస్మిక తనిఖీల ద్వారా పిహెచ్‌సిల పనితీరును పరిశీలిస్తామన్నారు. సీజనల్ వ్యాధులపై హోర్డింగుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్గించాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి వ్యాధినివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆలీంబాషా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వరసుందరం, డిసిహెచ్‌ఎస్ సుబ్బారావు, డిఆర్‌డిఏ పి.డి మురళి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్.ఇ నాగజ్యోతి, డిఇఓ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



### కాంగ్రెస్‌పై...
# ప్రజలు ప్రేమ చూపిస్తున్నారు



కసుమూరు దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మయ్యప్పన్, చేవూరు దేవకుమార్‌రెడ్డి

- ఏఐసిసి కార్యదర్శి మయ్యప్పన్

దేశవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్‌పై ప్రేమను చూపిస్తున్నారని, కేంద్రంలోని బీజేపిని ద్వేషిస్తున్నారని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయం సాధించడం ఖాయమని ఏఐసిసి కార్యదర్శి మయ్యప్పన్ పేర్కొన్నాడు. ఇటీవల నెల్లూరొచ్చిన ఆయన ఇందిరాభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఈ ఎన్నికల ద్వారా ప్రజలు చరమగీతం పాడారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టగానే ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వడం జరుగుతుందన్నారు. నిన్నటి ఎన్నికల్లో ఏపి ప్రజలు కాంగ్రెస్ పార్టీని బాగానే ఆదరించారని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పునర్వైభవం తేవడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాల్సి వుందన్నారు.

ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావ్, రఘురామ్‌ముదిరాజ్, చేవూరు శ్రీధర్‌రెడ్డి, ఫయాజ్, టి.బాల సుధాకర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# బురదనీళ్ళు తాగి ఎలా బతకాలి?

### మాజీఎంపి వరప్రసాద్‌తో గోడు వెళ్ళబోసుకున్న పేరపాటితిప్ప గ్రామస్తులు



ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా మా గ్రామానికి వారానికోసారి తప్ప మంచినీళ్ళు పంపిణీ చేయడం లేదు.. విధిలేని పరిస్థితుల్లో ఈ బురదనీళ్ళే వాడుకుంటున్నాం.. ఈ బురదనీళ్ళు త్రాగి ఎలా బతకాలో అర్థం కావడంలేదంటూ చిట్టమూరు మండలంలోని పేరపాటితిప్ప ప్రజలు మాజీ ఎంపి, వైఎస్సార్సీపి గూడూరు అసెంబ్లీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావుకు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. ఈనెల 5న ఆ గ్రామంలో పర్యటించిన వరప్రసాద్‌రావు ఆ గ్రామస్తులు బురదనీళ్ళు వాడుకుంటుండడం చూసి చలించిపోయారు. అక్కడున్న కోనేరు నీళ్ళనే ప్రజలు వాడుకుంటున్నారని, అవి బాగా అడుగంటిపోయి బురదనీరే వస్తోందని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత, కోనేటి నీటిని పరిశీలించి చూశారు. ఈ కోనేటిలో పశువులు దిగుతుంటాయని, ఆ నీటినే ప్రజలు తమ అవసరాలకు వాడుకోవాల్సి వస్తుండడం దయనీయమని అన్నారు. వైఎస్సార్సీపి అధికారంలోకి రాగానే ఈ సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఆయన వెంట నాయకులు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు మధుసూదనరెడ్డి, రాజారెడ్డి, దువ్వూరు శేషురెడ్డి, మల్లాం గోపాల్‌రెడ్డి, బివి రమణయ్య, జయరామిరెడ్డి, గజేంద్రరెడ్డి తదితరులున్నారు.

# నరసింహకొండలో 12 నుంచి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండ (వేదగిరి)పై వెలసివున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుంచి 22వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నామని, ఈ బ్రహ్మోత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లుచేసి విజయవంతం చేయాలని ఆర్డీఓ కె.జి చిన్నికృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 4న ఆర్డీఓ తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్ల విషయమై చర్చించారు. ఈనెల 17న స్వామివారికి బంగారు గరుడసేవ, 18న కల్యాణోత్సవం, 19న రథోత్సవం జరుగుతాయని, ఈ మూడురోజుల్లోనూ భక్తులరద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది కనుక భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటుతోపాటు, అంతటా పరిశుభ్ర వాతావరణం ఉండేలా చూడాలన్నారు. నరసింహకొండపైకి వచ్చే వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఏర్పాటుచేయాలని, విద్యుత్‌శాఖ, వైద్యశాఖ వారు అప్రమత్తంగా ఉండి భక్తులకు తగు సౌకర్యాలు, సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆలయ ఇ.ఓ ఏ.వి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

### దాహార్తితో...
# అల్లాడుతున్న ప్రజలు
### - పట్టించుకోని అధికారులు



గూడూరు మండల పరిధిలోని తిలక్‌నగర్, గాంధీనగర్, దివిపాళెం, చవటపాళెం గిరిజనకాలనీ, కొమ్మనేటూరు, కందళి, చెన్నూరు, మంగళపూరు తదితర గ్రామాల్లోని ప్రజలు ఈ మండువేసవిలో నీటి సదుపాయాలు లేక తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటివసతి లేని ఆయా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారానైనా తక్షణం నీటి సదుపాయాలు కల్పించి ప్రజల దాహార్తిని తీర్చాలని వారు కోరుతున్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం
### ఉచిత క్రీడా శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన హరిచంద్రారెడ్డి




మాట్లాడుతున్న హరిచంద్రారెడ్డి, పక్కన మునిగిరీష్

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రికెట్ క్రీడను ప్రోత్సహిస్తూ ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా శిబిరాన్ని ఈనెల 5న వైకాపా నాయకుడు హరిచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ఉన్నతంగా రాణించడం ద్వారా సమాజంలో అపారమైన గౌరవం లభిస్తుందని, క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. జిసిసి, హెచ్ఆర్‌సిసి, ఏఆర్‌సిసి, ఎస్ఎన్ఆర్‌సిసి ఆధ్వర్యంలో ఏటా ఈ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.మునిగిరీష్, అనిల్, లవకుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ముస్లిం చిన్నారులకు ఉచిత ఖత్నాలు




మాట్లాడుతున్న రియాజ్, పక్కన అధ్యక్షుడు అబ్దుల్ రహీం తదితరులు

గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో మహమ్మదీయ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఈనెల 5న ముస్లిం చిన్నారులకు ఉచితంగా ఖత్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గత పదేళ్ళుగా ప్రతి సంవత్సరం మే నెలలో ఉచిత ఖత్నాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈసారి సుమారు 150 మంది పిల్లలకు ఖత్నాలు నిర్వహించామని తెలిపారు. అనంతరం పిల్లలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తొలుత, 13వ వార్డు కౌన్సిలర్ షంషీర్ తండ్రి రహంతుల్లా మృతికి సంతాపసూచకంగా రెండునిమిషాల పాటు అందరూ మౌనం వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్, డాక్టర్ మహబూబ్‌బాషా, కాలేషా, రఫీ, రవూఫ్, నాజర్, యూసఫ్ మగ్దూం మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### సిబిఎస్ఇ టెన్త్ ఫలితాల్లో..
# లిటిల్ ఏంజెల్స్ ప్రతిభ



బివిఎస్ స్నేహిత

సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాల్లో గూడూరు మండలం, చిల్లకూరులోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూలు తన ప్రతిభను చాటుకుంటూ పలు విజయాలను సాధించింది. 500 మార్కులకు గాను 482 మార్కులు సాధించి బివిఎస్ స్నేహిత అనే విద్యార్థిని స్కూల్ టాపర్‌గా నిలిచిందని స్కూల్ కరెస్పాండెంట్లు బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపారు. అదేవిధంగా 477 మార్కులు సాధించి డి.డి శ్రీనివాస్, ఎన్.దీక్షిత్, ఎం.శ్రీసౌమ్యలు ద్వితీయస్థానంలో నిలిచారని పేర్కొన్నారు. పరీక్షకు హాజరైన అందరు విద్యార్థులు నూటికి నూరుశాతం ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని, ఈ ఘనవిజయానికి కారకులైన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, విద్యార్థులను అందరినీ ఆయన అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# మాలవ్యానగర్‌లో చలివేంద్రం



రామ్మోహన్‌రావు

గూడూరులోని మాలవ్యానగర్‌లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు, ఈ మండుటెండల్లో చల్లని నీరిచ్చేందుకు ఎన్‌వి రత్నం ఛారిటీస్ వారు ఇటీవల చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఛారిటీస్ ఛైర్మన్, సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఈ చలివేంద్రాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

### వీరభద్రస్వామి ఆలయంలో..
# దివ్యాంగులకు ఫలసరుకులు పంపిణీ



రోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సి.రోహిణి

గూడూరు పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి దేవాలయంలో ఈనెల 5న రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఫలసరుకులు పంపిణీ చేశారు. ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ దివ్యాంగులకు రెడ్ సంస్థ అండగా నిలిచి వారి జీవితాలకు భరోసా ఇస్తున్నదన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు జమునమ్మ, జీవని, ప్రభారెడ్డి, శశికళ, శ్రీధర్, సుధీర్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

### దోమలు బాబోయ్..
# దోమలు!



గూడూరులో మురుగుకాలువలు నిండిపోయి పొంగిపొర్లుతున్నాయని, చెత్తాచెదారాలన్నీ పేరుకుపోతున్నాయని, దీంతో దోమల బాధ భరించలేకున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ఉక్కపోతతో పాటు దోమల బాధ అధికంగా ఉందని, వెంటనే మునిసిపల్ అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# కంప్యూటర్‌తో తుఫాన్‌ను తరిమేసిన బాబు

గల్పిక

అది వైకుంతం... శేషపాన్పుపై శ్రీమహావిష్ణువు పడుకుని ఎదురుగా వున్న టీవీలో 'కొడితే మొగుడినే కొట్టాలి" సీరియల్ చూస్తుంటే, లక్ష్మీదేవి ఆయన తలకు అమృతాంజన్ రాసి రుద్దుతూ... ఎలక్షన్ చూద్దామని ఆ భూలోకంకు పోవడమెందుకు... ఎండల దెబ్బకు తల వేడెక్కి ఇలా మర్దన చేయించుకోవడ మెందుకు... మరీ అంతగా ఎండలు మండిపోతున్నాయా అక్కడ అని అడి గింది. అందుకు విష్ణువు... మండి పోవడమేంటి... ఆ ఎండల్లో గంట నిల బడితే మనిషి కూడా మాడి మసైపోవా ల్సిందే అని అన్నాడు. ఆ ఎండలను తగ్గించి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించొచ్చుకదా అని లక్ష్మీదేవి అడిగింది. దానికి విష్ణు... ఏపి ప్రజలపై నాకు ఆ మాత్రం ప్రేమ లేదను కున్నావా... ఏపిలో మామూలుగా అయితే వర్షాలు పడవు... అక్కడి రాజకీయ వాతావరణం అలా వుంది. అందుకే తుఫాన్‌తోనన్నా వర్షాలు పడతా యని చెప్పి ఈ మే నెలలోనే బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడేలా చేశాను. అది తీవ్ర వాయుగుండంగా మారి తమిళనాడు - ఆంధ్రప్రదేశ్‌ల మధ్య తీరం దాటుతుంది. రెండు రాష్ట్రాలలోనూ సమృద్ధిగా వర్షాలు పడి వాతావరణం చల్లబడుతుంది. ప్రజలు కూడా కూల్ అవుతారు అని చెప్పాడు. ఆ మాటకు లక్ష్మీదేవి మనసు కుదుటపడింది. అంతలో "నారాయణ నారాయణ" అనే మాటలు వినిపించాయి. విష్ణుమూర్తి వుండి... అదిగో మన దేవలోక బిబిసి ఛానెల్ వచ్చింది. ఏం వార్తలు మోసుకొచ్చాడో అని అంటుండగా నారదుడు అక్కడకు వచ్చేశాడు. ఏం నారద ఏంటి భూలోక విశేషాలు అని విష్ణుమూర్తి అడిగాడు. దానికి నారదుడు... అదేదో 'ఫాని' తుఫాన్ అంట స్వామి... ఒరిస్సా రాష్ట్రాన్ని వణికించింది. భారీ వర్షాలు పడ్డాయి. భీభత్సంగా తోలిన గాలులకు పెద్దపెద్ద టవర్లు కూలిపోయాయి అని చెప్పాడు. ఆ మాటకు విష్ణుమూర్తి షాక్ తిన్నాడు. లక్ష్మీదేవి అయితే... ఆంధ్రాలో వర్షాలు కురిపించమంటే ఒరిస్సాలో కురిపిస్తున్నావా... నీ తెలివి తెల్లారినట్లే వుంది అన్నట్లు విష్ణుమూర్తివైపు వెట కారంగా చూసింది. లక్ష్మీదేవి చూసిన చూపుకు విష్ణుమూర్తికి తల కొట్టేసినట్ల య్యింది. అదేంటి నారదా... ఆ తుఫాన్ తీరం దాటాల్సింది ఆంధ్ర-తమిళనాడుల మధ్య కదా.... నేను వాయుదేవుడిని, వరుణ దేవుడిని ఆ విధంగానే ఆదేశించి వున్నాను. నా ఆర్డర్‌లో ఎలాంటి పొర పాటు లేదు. మరి వాళ్లిద్దరూ ఒరిస్సా దాకా ఎందుకు పోయారు. నా కమాండ్‌లో ఏదన్నా తప్పు జరిగిందా? ఏమిటి ఈ వైపరీత్యం అని మదన పడసాగాడు. అందుకు నారదుడు... మీ ఆదేశాలను కాదని, తుఫాన్ తన దిశనే మార్చుకుందంటే భూలోకంలో మీకంటే బలమైన శక్తి ఏదో వుంది ప్రభూ... ఆ శక్తి మూలంగానే మీ శక్తి నిర్వీర్యమై పోయింది అని అన్నాడు. ఏమిటా శక్తి అని విష్ణుమూర్తి ప్రశ్నించాడు. టీవీలో ఏబిసిడి న్యూస్ ఛానెల్ పెట్టండి. ఏదన్నా విశేషాలు తెలియొచ్చు అని నారదుడు అన్నాడు. అప్పుడే 'కొడితే మొగుడినే కొట్టాలి' సీరియల్‌లో 2,46,349 ఎపిసోడ్ ముగియడంతో ఛానెల్ మార్చినా లక్ష్మీదేవి ఏమీ అనదులే అనే ధైర్యంతో విష్ణుమూర్తి రిమోట్ తీసుకుని ఏబిసిడి న్యూస్ ఛానెల్ పెట్టాడు. అప్పుడే ఏపి సీఎం, హైటెక్ రత్న చంద్రబాబునాయుడు ప్రెస్‌మీట్ లైవ్ వస్తోంది. చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ ఎవరండీ నన్ను సమీక్షలు చేయొద్దని చెప్పడానికి... నేను సమీక్షలు పెడతా... పరిపాలనలో జోక్యం చేసు కుంటా... తుఫాన్ సమయంలో నేను యాక్షన్ చేయకపోతే నా అనుకూల పత్రికలు, ఛానల్స్ ఏమైపోవాలి... తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో నేను తిరిగినట్లు, గాలులకు ఒరుగుతున్న స్థంభాలను నేను చేతులు అడ్డం పెట్టి ఆపినట్లు... కూలుతున్న చెట్లను నేను ఒంటిచేత్తో నిలబెట్టినట్లు... వరద ప్రవా హంలో కొట్టుకుపోతున్న ప్రజలను నేను ఈదుతూ వెళ్లి కాపాడినట్లు... ఎన్ని సీన్‌లు, ఎన్ని ఫోటోలు... ఇవన్నీ వాళ్ళు మిస్ అవుతారు కదా... కాబట్టి నేను సమీక్షలు పెడతాను, జూన్10 దాకా నేనే సీఎంను అని అన్నాడు. టీవీలో చంద్ర బాబు నోట ఆ మాట వినగానే... విష్ణు మూర్తి 'అబ్బా దెబ్బ కొట్టావు చంద్రబాబు' అంటూ తల పట్టుకున్నాడు. ఏమైంది ప్రభు అని నారదుడు అడిగాడు. అందుకు విష్ణుమూర్తి.... నాకంటే బలమైన శక్తేదో తుఫాన్‌ను దారిమళ్లించి వుంటుందన్నావు కదా... ఆ శక్తి ఎవరో కాదు.. ఈ చంద్రబాబే... ఆయన జూన్ 10 దాకా నేనే సీఎం అనేశాడు. ఆ మాటతో బంగాళాఖాతంలో తుఫాన్ ఏపిని వదిలి ఒరిసాకు పరారైందని చెప్పాడు.

అప్పుడు నారదుడు... ప్రభు, తుఫాన్ ఆయన మాటతో దారిమళ్ళ లేదు. ఏపికి నష్టం జరుగకూడదని ఆయనే దారి మళ్లించాడు. ప్రకృతికి కళ్లెం వేసే శక్తులు చంద్రబాబు వద్ద వున్నాయట కదా... తుఫాన్‌ను అరచేత్తో ఆపుతాడట... వరదలను చూపుడు వేలితో శాసిస్తా డట... అదేదో క్యాష్‌బోర్డు ద్వారా ఆయన ఇవన్నీ చేస్తాడట. నిజమేనా అని అడి గాడు. అందుకు విష్ణువు... అది క్యాష్ బోర్డు కాదు నారద... డాష్‌బోర్డ్ అని అన్నాడు. దానికి నారదుడు... ఆ డ్యాష్ బోర్డు ద్వారానే ఆయన తుఫాన్‌ను ఒరిస్సాకు పంపించాడంట... కావాలంటే చూడండి అని తన వేలితో ఎయిర్‌స్క్రీన్ గీసి సీన్ ప్లే చేశాడు.

వెలగపూడి సచివాలయంలోని డాష్‌బోర్డ్ హాల్... చంద్రబాబు ముందు కంప్యూటర్ వుంది. ఆయన వెనుక మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, పి.నారాయణలు వున్నారు. కంప్యూటర్ స్క్రీన్‌పై బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన పిక్చర్, అది కదులు తున్న దిశ కనిపిస్తున్నాయి. చంద్రబాబు మౌస్‌తో అల్పపీడనం కదులుతున్న దిశపై క్లిక్ చేసి కాపీ చేశాడు. మంత్రులంతా దానిని ఆసక్తిగా చూస్తున్నారు. చంద్రబాబు వారితో... వాయుగుండం ఇప్పుడు చెన్నై-నెల్లూరుల మధ్య కేంద్రీకృతమై వుంది. ఇది మన రాష్ట్రంలో ఎక్కడ తీరం దాటినా వేల కోట్లలో నష్టం వస్తుంది. అందుకే దీనిని ఒరిస్సా బోర్డర్‌కు పంపి స్తున్నాను అంటూ మౌస్‌తో అల్పపీడనం మార్క్ చేసిన పాయింట్‌ను కదిలిస్తూ ఒరిస్సా తీరంకు తీసుకెళ్లి అక్కడ వది లాడు. కంప్యూటర్‌లో చంద్రబాబు మార్క్ చేసినట్లే బంగాళాఖాతంలో తుఫాన్ ఆంధ్రాను వదిలి ఒరిస్సాకు వెళ్లిపోయి నట్లు అప్పుడే వాతావరణ శాఖ తెలి పింది. ఈ పరిణామానికి మంత్రులు కూడా బిత్తరపోయి... తుఫాన్‌లను తన్ని తరిమిన చంద్రబాబుకు జై అంటూ నినాదాలు చేయసాగారు.

ఎయిర్ స్క్రీన్‌పై ఇక్కడితో సీన్‌లు అయిపోయాయి. అంతా చూశాక ఇప్పుడు మీకు ఏం అర్థమైంది ప్రభు అని నారదుడు అడిగాడు. దానికి విష్ణుమూర్తి... జూన్ 10 దాకా నేనే సీఎంను అని చంద్రబాబు చెప్పేసరికే తుఫాన్ ఒరిస్సాకు పరారైంది. కాని చంద్రబాబు దానిని కవర్ చేసు కోవడానికే... కంప్యూటర్ కమాండ్‌తో తుఫాన్‌ను తన్ని తరిమేశానని చెప్పుకోవ డానికి ఈ డాష్‌బోర్డ్ సీన్ క్రియేట్ చేశాడని అసలు విషయం చెప్పాడు.

### ప్రభుత్వ వైద్యకళాశాలలో...

## ఎంసీఐ బృందం తనిఖీలు

ప్రభుత్వ వైద్యకళాశాల, జనరల్ ఆసుపత్రిలో భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) బృందం ఈనెల 4న తనిఖీలు చేపట్టింది. వైద్యుల సేవలు, కళాశాలలో బోధన విధానం, అవసరమైన మౌళిక వసతుల కల్పన తదితరాలను పరిశీలించింది. కర్ణాటక నుండి వచ్చిన డాక్టర్ మమత, మహారాష్ట్ర నుంచి వచ్చిన డాక్టర్ పరాగ్ గోర్పాడే బృందం భారతీయ వైద్య మండలి ఆదేశాల ప్రకారం ఈ పరిశీలన చేసింది. ముందుగా జనరల్ ఆసుపత్రిలోని రోగుల వార్డులను వారు పరిశీలించి అందిస్తున్న సేవలపై రోగులతో మాట్లాడారు. వైద్య పరికరాల ఏర్పాటు, వాటి పనితీరును తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యకళాశాలలో వైద్యుల ధృవీకరణను తనిఖీ చేసారు. అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు పోస్ట్ గ్రాడ్యుయేట్ విభాగానికి సంబంధించి అనుమతిని పరిశీలించేందుకు ఈ ఎంసీఐ బృందం నెల్లూరుకు వచ్చింది. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, డాక్టర్ మస్తాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## కరెంటాఫీసు వద్ద చల్లని మజ్జిగ చలివేంద్రం


ఈ మండువేసవిలో పాదచారులకు కాస్తంత ఉపశమనం ఇచ్చి సేదదీర్చేందుకు నగరంలోని పలు స్వచ్ఛంధసంస్థల వారు ఆక్కడక్కడా చల్లని నీరిచ్చే చలివేంద్రాలు, మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటుచేస్తుండడం ఎంతైనా అభినందనీయం. వీటిలో భాగంగా నెల్లూరు వేదాయపాళెంలోని కరెంటాఫీసు కూడలి వద్ద ఉన్న సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహం వద్ద ఈనెల 5న పతంజలి ఫ్రెండ్స్ అసోసియేషన్‌వారి ఆధ్వర్యంలో చల్లని మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు పతంజలితో పాటు సభ్యులు సాయికుమార్‌రెడ్డి, పవన్,రమేష్, గణేశ్ , శేఖర్, మస్తాన్, దిలీప్, గురవయ్య, భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఫత్తేఖాన్‌పేట మిత్రమండలి ఆధ్వర్యంలో...

నగరంలోని ఫత్తేఖాన్‌పేటలో ఈనెల 5న అరిగెల నారాయణ గ్రంథాలయం వద్ద ఫత్తేఖాన్‌పేట మిత్రమండలి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం, మినరల్‌వాటర్ కేంద్రాలను ప్రారంభించి ప్రజలకు ఈ వేసవి తాపాన్నుంచి సేదదీరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో షణ్ముఖేశ్వరరావు, అరిగెల సాయిరామ్, వెంకటకిరణ్, రవి, తంజావూరు మల్లికార్జున్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భానుడి భగభగలు..

**భానుడి భగభగలతో సింహపురి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. గత వారం రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలతో జిల్లా నిప్పుల కొలిమిగా మారింది. వడ గాలులు, పడమర గాలులుతోటి సూర్యతాపం బెంబేలెత్తిస్తోంది. బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారు తున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలావుంటే రాబోయే రోజుల్లో పరిస్థితి మరీ దారుణంగా వుంటుందని ప్రజలు భయపడుతున్నారు.**



ఎండలకు చిన్నారులు, వృద్దులు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఈనెల ఒకటవ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. ఇటీవల ఫోని తుఫాను వల్లనైనా వర్షాలు వస్తాయనుకుంటే ఉసూరుమనిపించింది. పరిశ్రమల కాలుష్యం తీవ్రత కూడా అధికంగా వుండడంతో రుతుపవనాల జాడ కనిపించడం లేదు. మామూలుగా మే మూడోవారం చివర్లో వచ్చే రోహిణీ కార్తెతో 43 డిగ్రీల నుండి 46 వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఈ ఏడాది మాత్రం రోహిణీ కార్తెకు ముందే ఎండలు మండుతున్నాయి. ఉదయం 8 గంటల దాటి బయటకు రావాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. సాయంత్రం 6.30 గంటల తర్వాత కూడా ఎండ తీవ్రత తగ్గడం లేదు. రాబోయే వారం రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాలులు వీచే అవకాశం వుంది.

గత వారం రోజుల్లో మే 1న 39.5 డిగ్రీలు, మే2న 40.5 డిగ్రీలు, మే 3న 44.6 డిగ్రీలు, మే 4న 41.5 డిగ్రీలు, మే 5న 46 డిగ్రీలు, మే 7న 45డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇప్పటికే వడదెబ్బ బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉందని ప్రజలందరూ అప్రమత్తంగా వుండాలని జిల్లా అధికారులు కోరుతున్నారు.

### చిల్లర దుకాణంపై...

## విజిలెన్స్ దాడులు

**రూ.1.12 లక్షల విలువచేసే గుట్కాలు స్వాధీనం**

నెల్లూరు పాత పెద్దాసుపత్రి రోడ్డు రాజేంద్రనగర్‌లో చిల్లర దుకాణం నిర్వహిస్తున్న ఎం.బాలు గత కొంతకాలంగా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి నిషేదిత గుట్కాలు, ఖైనీలు, జర్దాలు తీసుకొచ్చి గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నాడు. ఈనెల 6న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ కేసీ వెంకటయ్య. ఇన్‌స్పెక్టర్ పివి నారాయణ తమ సిబ్బందితో అతని దుకాణంపై దాడి చేసి రూ.1.12 లక్షలు విలువ చేసే 25బస్తాల గుట్కా, ఖైనీ, జర్దాలను స్వాధీనం చేసుకున్నారు. దుకాణం నిర్వాహకుడు బాలును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గుట్కా, ఖైనీ, జర్దాల విక్రయాలపై దాడులు చేస్తున్నామని, ప్రజలు సైతం వీటి విక్రయాలు, నిల్వలపై సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## కల్యాణ వైభవం...!



గూడూరులోని మోతీ మహల్ అధినేత కంచర్ల నవీన్ చౌదరి - మమతల కుమారుడు సాయి శంతన్ చౌదరి - రుషిత (హైదరాబాద్ వాస్తవ్యులు రామినేని మధుసూదన్‌రావు - రూపాదేవిల కుమార్తె) ల కల్యాణం ఏప్రిల్ 18వ తేదీ నెల్లూరులోని పి.వి.ఆర్. కళ్యాణ మండపం నందు వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

### జిల్లా ప్రజలకు...

# ఉపాధి అవకాశాలు కల్పించండి

**- డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డికి మనుక్రాంత్ వినతి**



యుఎస్‌ఏలో ప్రైమ్ హెల్త్‌కేర్ సర్వీసెస్ పేరుతో 45 ఆసుపత్రులు నెలకొల్పి 40వేల మంది సిబ్బందితో ఎంతో కాలంగా వైద్యరంగంలో విశిష్ట సేవలందిస్తున్న డాక్టర్ ప్రేమ్‌సాగర్ రెడ్డిని తాను ఇటీవల కలిసి నెల్లూరు జిల్లా ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిందిగా కోరినట్లు జనసేన నాయకుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రైమ్ ఎరా పేరిట ఇండియాలో సంస్థను ఏర్పాటుచేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న తమ శాఖను నెల్లూరులో స్థాపించి ఈ ప్రాంతప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరామన్నారు. కాగా, ప్రేమ్‌రెడ్డి పేరిట యుఎస్‌ఏ, ఇండియాలో విశిష్టసేవలందిస్తున్న సేవాసంస్థలో మనుక్రాంత్‌రెడ్డి తండ్రి చెన్నారెడ్డి సుబ్బిరామిరెడ్డి కూడా ఒక డైరెక్టర్‌గా ఉంటూ సేవలందిస్తుండడం విశేషం.

### ఇరుకళలమ్మ దేవస్థానం ప్రాంగణంలో..

# భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన



భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఇ.ఓ వేమూరి గోపి

సింహపురి గ్రామ దేవత, నెల్లూరు నగర శివారులో వేంచేసి యున్న భక్తుల కొంగు బంగారం శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో పొంగళ్ళు పెట్టే, భోజనశాల నూతన నిర్మాణానికి ఈనెల 8న శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఇవో వేమూరి గోపి, అర్చకుల ఆధ్వర్యంలో భూమిపూజ జరిగింది. ఆలయ ఛైర్మన్ వి.సుధాకర్‌యాదవ్, ఆలయ ఇవో వేమూరి గోపి మాట్లాడుతూ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి భక్తులు పొంగళ్ళుతో మొక్కులు తీర్చుకుంటారని, భక్తులు అమ్మవారికి పొంగళ్ళు పొంగించేందుకు వంటశాల లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి ఇబ్బందులు తీర్చేందుకు అధునాతన సౌకర్యాలతో వంటశాల, భోజనశాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన భవనం నిర్మాణాలకు దాతలు వస్తు రూపేణా, ధన రూపేణా విరాళాలు అందజేసి రశీదులు పొందాలని కోరారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అమ్మవారి కరుణ కటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు. ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

### నర్తకి సెంటర్‌లో...

# అర్బన్ ఆర్యవైశ్య సంఘం చలివేంద్రం




నెల్లూరు, నర్తకి సెంటర్‌లో నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఈనెల 7వతేదీన నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, సంఘం అధ్యక్షులు కోటా సూర్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి వి.ఇ.మురళీకృష్ణ, కోశాధికారి అమరా వెంకటేశ్వర్లు, అదనపు ప్రధానకార్యదర్శులు బయ్యా రవికుమార్, దొంతంశెట్టి వివేకానంద, ప్రాజెక్ట్ ఛైర్మెన్ చలువాది శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపి ఐసెట్‌లో కృష్ణచైతన్య ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసిన ఏపి ఐసెట్ ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభాపాటవాలతో ఉత్తమ ర్యాంకులు సాధించారని ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. తమ కళాశాలకు చెందిన కె.ప్రవీణ 110వ ర్యాంకు, భవాని సుప్రియ 214వ ర్యాంకు, ఎస్‌కె సుజత్ నయరా 261వ ర్యాంకు సాధించారని, మొత్తంగా 650 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 602 మంది అర్హత సాధించారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ రోలర్ స్కేటింగ్ పోటీలకు దుర్గశ్రీ



ప్రపంచ రోలర్ స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన బి.పవిత్ర దుర్గశ్రీ ఎంపిక కావడం విశేషం. జులై 4 నుంచి 14వ తేదీ వరకు స్పెయిన్ రాజధాని బార్సిలోనాలో జరిగే ప్రపంచ రోలర్ స్కేటింగ్ గేమ్స్‌లో జిల్లా నుంచి తొలిసారిగా ఎంపికైన క్రీడాకారిణి దుర్గశ్రీ. 2018లో విశాఖలో జరిగిన 56వ జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో బాలికల విభాగంలో దుర్గశ్రీ రజత పతకాన్ని సాధించింది. అదేవిధంగా ఈనెల 4, 5తేదీల్లో మహారాష్ట్రంలో జరిగిన జాతీయ జట్టు ఎంపికలో పాల్గొని ప్రతిభా పాటవాలతో రాణించి ప్రపంచ రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత పొందిందని ఆ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఎన్‌వి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జాతీయజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న పవిత్ర దుర్గశ్రీని, శిక్షకుడు జితేంద్రను జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జడ్.శివప్రసాద్, జి.ఈశ్వర్‌లు అభినందించారు.

# రెడ్‌క్రాస్ సేవలు ఆదర్శనీయం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు ఆదర్శనీయమని జేసి-2 సాధన అభినందించారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8న నెల్లూరులో జరిగిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. అనంతరం రెడ్‌క్రాస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నెల్లూరు రెడ్‌క్రాస్ సేవలు ఎంతో అభినందనీయమైనవని ఆమె ప్రశంసించారు. రెడ్‌క్రాస్ సొసైటీలో ప్రజలు జీవితకాల సభ్యులుగా చేరి సేవలందించాలని పిలుపునిచ్చారు. ప్రజలు స్వచ్ఛంధంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలన్నారు. ఎక్కడైనా విపత్తులు సంభవించినప్పుడు రెడ్‌క్రాస్ తరపున స్వచ్ఛంధంగా పాల్గొని సేవా కార్యక్రమాలు నిర్వహించిన 60 మందికి ఈ సందర్భంగా అవార్డులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి ఛైర్మెన్ ఏవి సుబ్రహ్మణ్యం, కన్వీనర్ సుబ్బారావు, సభ్యులు గౌస్‌బాషా, భాస్కర్‌రావు, రీజనల్ కోఆర్డినేటర్ గంటా వెంకట్రావ్‌కుమార్‌తో పాటు రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

# వివిఎస్‌యులో కొత్త కోర్సులు

విక్రమసింహాపురి విశ్వవిద్యాలయంలో కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నామని, విద్యార్థులకు వసతులు మెరుగుపరుస్తామని వివిఎస్‌యు ఉపకులపతి ఆర్.సుదర్శనరావు తెలిపారు. ఇక్కడ పీజీ కోర్సులు అడ్మిషన్ల బ్రోచర్‌ను ఈనెల 8న ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019-20 సంవత్సరానికి వివిఎస్‌యు నెల్లూరు ప్రాంగణంలో ఆర్ట్స్ అండ్ సోషల్‌సైన్స్‌లో 6 కోర్సులు, సైన్స్ అండ్ టెక్నాలజీలో 8 కోర్సులు, కావలిలోని పీజీ సెంటర్‌లో 6కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు జూన్ 6-8 తేదీల్లో రాతపరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ఈ ఏడాది నుంచి కొత్తగా పీజీ డిప్లొమో ఇన్ జర్నలిజం, డిప్లొమా ఇన్ ఆక్వా కల్చర్, పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌లేషన్ కోర్సులు ప్రవేశపెడుతున్నామని, విద్యార్థులే కాకుండా ఉద్యోగాలు చేసేవారు ఈ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. వివిఎస్‌యు అకడమిక్ భవనం, లైబ్రరియన్ భవనాలు, నూతన వసతి గృహాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. వివిఎస్‌యు రిజిస్ట్రార్ అందె ప్రసాద్, ప్రిన్సిపల్ జవహర్ బాబు, పీజీ సెట్ కన్వీనర్ వీరారెడ్డి, సాయి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డు కుటుంబానికి చేయూత

ఆత్మకూరులో అగ్నిమాపకశాఖ కేంద్రంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన హోంగార్డు ఎస్‌కె సిరాజ్ కుటుంబసభ్యులకు జిల్లా అగ్నిమాపక అధికారి ఐ.ధర్మారావు చేతులమీదుగా ఆర్థికసాయం అందజేశారు. జిల్లా అగ్నిమాపకసిబ్బంది అసోసియేషన్, సిబ్బంది కలిసి సిరాజ్ కుటుంబ సభ్యులకు లక్షా 8వందల రూపాయల చెక్కును అందించడం అభినందనీయమని ధర్మారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి శంకర ప్రసాద్, నెల్లూరు అగ్నిమాపకాధికారి శ్రీనివాసరావు, అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి రాజేంద్ర, కోశాధికారి దేవిడ్‌సన్, జాయింట్ సెక్రటరీ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# వాళ్ళది పెట్టుబడి... వీళ్ళది దోపిడీ!

దోచేవాడు దళారి... దోపిడీకి గురయ్యేవాడు రైతు... ఈ సూత్రం మార్కెట్‌లో ఎప్పుడూ అమలవుతూనే వుంటుంది. పంట బాగా చేతికొచ్చిన రోజు మార్కెట్‌లో రేటుండదు... మార్కెట్‌లో బాగా రేటున్నప్పుడు ఇక్కడ పంట సరిగా రాదు. ఇదే మూలసూత్రం. ఆక్వా రంగంలో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.



ఒకప్పుడు డాలర్ల పంట ఇది. ఎంతో మంది రైతులను కోటీశ్వరులను చేసిన సాగు ఇది. ఎన్నో వేల ఎకరాల వరిపొలాలను రొయ్యల గుంటలుగా మార్చిన పంట ఇది. ఇలాంటి ఆక్వా రంగంలో గత కొన్నేళ్ళుగా ఆటుపోట్లు వస్తున్నాయి. ఒకప్పుడు ఈ సాగు మూలంగా కోటీశ్వరులైన చాలా మంది రైతులు ఇప్పుడు అదే సాగు మూలంగా బికారులవుతున్నారు. దీనికంతా కారణం ఆక్వాసాగులో తలెత్తుతున్న పరిణామాలే! వైరస్, నకిలీ సీడ్, అధిక ఉష్ణోగ్రతలు, నీటికొరత, దళారుల సిండికేట్, పడిపోతున్న రేట్లు రైతులకు శాపంగా మారుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు బాగానే వుంటున్నప్పటికీ దళారులు సిండికేటుగా ఏర్పడి రేట్లను తగ్గించేస్తున్నారు. రైతు కష్టాన్ని నిలువునా దోచుకుంటున్నారు.

జిల్లాలోని కావలి, అల్లూరు, విడవలూరు, కొడవలూరు, బుచ్చి, టిపి గూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, దొరవారిసత్రం, నెల్లూరురూరల్, ఇందుకూరుపేట మండలాలలో దాదాపు 50వేల ఎకరాలలో ఆక్వాసాగు వుంది. 10వేల మందికి పైగా రైతులు ఆక్వా సాగును నమ్ముకుని వున్నారు. ఒక క్రాప్‌లో నష్టం వచ్చినా ఇంకో క్రాప్ అయినా చేతి కొస్తుందనే ఆశ, నమ్మకంతో ఆక్వాసాగును వాళ్ళు వదలడం లేదు. గతంతో పోలిస్తే ఆక్వాలో ఆదాయాలు గణనీయంగా పడిపోగా పెట్టుబడులు మాత్రం రెట్టింపయ్యాయి. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఆక్వా రైతులకు కన్నీళ్ళు తెప్పిస్తున్నాయి. ఆక్వా గుంటల్లో ఆక్సిజన్ చాలక ఎక్కువ సంఖ్యలో ఏరియేటర్లను పెట్టాల్సివస్తోంది. అధిక ఉష్ణోగ్రతల దెబ్బకు వైరస్ సోకుతోంది. దీంతో సరైన కౌంట్ రాకముందే పిల్లల్ని ఎత్తేస్తున్నారు. కౌంట్ ఎక్కువగా వుండే రొయ్యలకు మార్కెట్‌లో ధర దారుణంగా వుంటోంది. దీనికితోడు సీడ్, ఫీడ్ పెట్టుబడులు అధికమయ్యాయి. అటు పెట్టుబడులు పెరిగి ఇటు ప్రతికూల పరిస్థితుల వల్ల సరైన దిగుబడులు లేక, అష్టకష్టాలు పడి తీసిన క్రాప్‌కు గిట్టుబాటు ధరలు లేక చివరకు ఆక్వా రైతుల బ్రతుకులే గిటకబారిపోతున్నాయి.

# మసకబారుతున్న చంద్రుడు

(మొదటి పేజీ తరువాయి)

లేవు... మీడియాలో ప్రత్యేక కథనాలు లేవు... మాకు అన్యాయం జరిగిందని, మాగోడు ఎవరూ పట్టించుకోలేదని రోడ్డెక్కిన బాధితులూ లేరు. వేటిపాటికవి శుభ్రంగా పనులు జరిగిపోయాయి. పద్ధతిగా నష్టం అంచనా లెక్కడితే 58కోట్లుగా తేలింది. అధికార యంత్రాంగం ఇంత పారదర్శకంగా పనిచేస్తే అసలు రాజకీయ వ్యవస్థల అవసరముండదు అనిపించేంతగా ఎల్.వి.సుబ్రహ్మణ్యం నేతృత్వంలో అన్ని శాఖలూ పని చేశాయి.

సీ.యస్‌గా ఎల్.వి.సుబ్రహ్మణ్యం పనితీరు సీఎం చంద్రబాబు వ్యక్తిగత ప్రతిష్టకు సంకటంగా మారింది. ఎందుకంటే ఎలాంటి భారీ ఖర్చులు, ఆర్భాటాలు లేకుండా సీరియస్‌గా సి.యస్ పని చేస్తున్నాడు. ఇదే పని చంద్రబాబు చేసుంటే కోట్లలో సొంత ఖర్చుండేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

చంద్రబాబుది 40ఏళ్ళ రాజకీయ అనుభవం. 14ఏళ్ళు ముఖ్యమంత్రిగా అనుభవం. కాని ఏం లాభం... ఈ దఫా పరిపాలనలో ఆయన ప్రతిష్ట దిగజారింది. తనకుతానే దిగజార్చుకున్నాడు. రాజకీయ సైద్ధాంతిక పోరాటాలను వదిలేసి ప్రజాస్వామ్య వ్యవస్థల మీద పడ్డాడు. మొదట సిబిఐపై నిషేధం పెట్టాడు. తర్వాత ఎన్నికల కమిషన్‌పై పడ్డాడు. ఇప్పుడు సియస్‌తోనూ పెట్టుకుంటున్నాడు. ఈవిఎంలలో మోసాలు అంటూ కోర్టుకెక్కాడు. 50శాతం వివిప్యాట్‌లను లెక్కించాలంటూ సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై తీర్పును వినేందుకు ఆయనే స్వయంగా మరికొందరు ప్రాంతీయపార్టీల నేతలను కలుపుకుని సుప్రీంకోర్టుకు వెళ్లారు. తీరా అక్కడ కోర్టు ఈ పిటిషన్‌నే తిరస్కరించి పడేయడంతో మొహాలు వేలాడేసుకుని బయటకొచ్చారు.

గతంలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఎంతో మంది సీఎంలుగా పనిచేసి వున్నారు. ఎన్నికల కోడ్ వున్నప్పుడు ఎవరూ సచివాలయానికి వెళ్ళే వాళ్ళు కాదు. ఎన్నికల నియమావళిని గౌరవించేవాళ్ళు. చంద్రబాబు అలాకాకుండా జూన్10 దాకా నేనే సీఎం, నాకు టైం వుందంటూ నానా యాగి చేస్తున్నాడు. దేశంలో వున్న సీనియర్ రాజకీయవేత్తలలో ఒకడిగా తనపై వున్న గౌరవాన్ని తానే తగ్గించుకుంటున్నాడు.

# తెలుగు పార్టీలకు వెలుగు

(మొదటి పేజీ తరువాయి)

నుండి గెలిచిన మెజార్టీ సీట్ల వల్లే కేంద్రంలో యూపిఏ ప్రభుత్వం ఏర్పడింది. రేపు కూడా కేంద్రంలో అదే పరిస్థితి రాబోతుందా? ఎందుకంటే ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాకపోవచ్చునని, అటు ఎన్డీఏ కాని, ఇటు బీజేపీయేతర ఫ్రంట్ కాని మెజార్టీకి పాతిక, ముప్పై సీట్ల దూరంలో ఆగిపోవచ్చునని అంచనా! ఈ దశలో తెలంగాణలో టిఆర్ఎస్, ఆంధ్రాలో 15కుపైగా సీట్లు సాధిస్తే అది వైసిపిగాని, టీడీపీ గాని కేంద్రంలో కీలకం కావచ్చు. అప్పుడు బీజేపీ అయినా విపక్షాలు అయినా ప్రభుత్వం ఏర్పాటుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్టీలను ఆశ్రయించక తప్పదు. తెలుగు రాష్ట్రాల పార్టీల మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడితే... ఢిల్లీ స్థాయిలో తెలుగు వెలుగులు మళ్ళీ విరాజిల్లినట్లే!

## క్రీడలకు ప్రోత్సాహాన్నిస్తున్నాం

**- విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయకుమార్**

తమ శాఖలో క్రీడలకు మంచి ప్రోత్సాహాన్నిస్తామని విద్యుత్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.విజయకుమార్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు దర్గామిట్టలోని విద్యుత్ భవన్‌లో ఇటీవల జరిగిన నెల్లూరు సర్కిల్ క్రీడాకారుల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కార్పొరేషన్ స్పోర్ట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఇటీవల ఏపి ట్రాన్స్‌కో, ఏపి జెన్‌కో, ఏపిఈపిడిసిఎల్, ఎపిఎస్పీడిసిఎల్ పరిధిలోని 13 జిల్లాలకు సంబంధించి 2018–19 వార్షిక క్రీడాపోటీలు జరిగాయన్నారు. జిల్లాకు చెందిన పురుషుల ఓవరాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండవ స్థానాన్ని, మహిళలు మూడవ స్థానాన్ని గెలుచుకున్నారని వివరించారు. ఇటీవల విజయవాడలో జరిగిన స్పోర్ట్స్, గేమ్స్ జనరల్‌బాడీ సమావేశంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేశారని పేర్కొన్నారు. ఉద్యోగబాధ్యతలను నిర్వహిస్తూనే క్రీడల్లో రాష్ట్రవ్యాప్తంగా మనజిల్లాకు మంచిపేరు తెచ్చిన క్రీడాకారులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. త్వరలోనే గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఇ.ఇలు అమరబాబు, జె.రమణాదేవి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఎస్ఏఓ సత్యనారాయణ, ఏఓ కె.శ్రీనివాసులు, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరీ జిఆర్ఎస్ వర్మ, కోశాధికారి మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న నగర డిఎస్పీ మురళీకృష్ణ

ఐపీయల్ క్రికెట్ చివరి దశకు చేరుకున్న సమయంలో బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠా సభ్యులను నెల్లూరు నవాబుపేట పోలీసులు ఈనెల 7న అరెస్ట్ చేశారు. ముఠాలోని ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.35వేల నగదు, రెండు ఐ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నగర డీఎస్పీ మురళీకృష్ణ తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ఈ బెట్టింగ్ ముఠాలో మొత్తం 13మంది సభ్యులు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. గతంలో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏ4గా వున్న నెల్లూరు పప్పుల వీధికి చెందిన ఊటుకూరు వెంకట రమేష్ అలియాస్ డీటీయస్, ఏ5గా వున్న నెల్లూరు సంతపేట ప్రాంతానికి చెందిన షేక్ ఖాదర్ నవాజ్‌లను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. గతంలో వీరిపై బెట్టింగ్ కేసులు నమోదై జైలుకు వెళ్ళి బెయిల్‌పై బయట తిరుగుతున్నారు. జైలు నుంచి బయటకు వచ్చి మళ్ళీ క్రికెట్ బుకీలుగా అవతారమెత్తారు. పంటర్స్ వద్ద డబ్బులు పందెంగా కట్టించుకుని ఐపీయల్ మ్యాచ్‌లు ఆడిస్తుంటారు. చెన్నై, బెంగళూరు ప్రాంతాల్లో వీరు ఉంటూ ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారు. ఎప్పటి నుంచో పోలీసులు వీరి కోసం నిఘావేయగా నెల్లూరు పప్పులవీధి వద్ద నవాబుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠాలో మరో 11మంది సభ్యులున్నారని వారిని త్వరలో అదుపులోకి తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్ సీఐ కె. శ్రీనివాసరావు, ఎస్.ఐ కె. వీరప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

## కన్యకాపరమేశ్వరి అమ్మవారికి లక్షమల్లెల అర్చన

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి బుధవారం రాత్రి మహిళాభక్తులంతా కలసి ఎంతో భక్తిశ్రద్ధలతో లక్షమల్లెల అర్చన నిర్వహించారు. అమ్మవారి జయంతి ఉత్సవాల్లో భాగంగా, అర్బన్ ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ వేడుకజరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు లలితాశివకుమార్‌స్వామి పర్యవేక్షణలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న మహిళలందరికీ పసుపుకుంకుమ, ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం మాతృమూర్తులకు పాదపూజ నిర్వహించారు. అర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు పిండి వెంకటలక్ష్మి, గౌరవ సలహాదారు చీతిరాల పద్మావతి, నాతా రాధ, ఎడ్లపల్లి మధురిమ తదితరుల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు.

## మొగళ్ళపల్లివారి సత్రం దుకాణాలు.. దేవాదాయశాఖ స్వాధీనం

నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులో రైల్వేస్టేషన్‌కు సమీపంలో వున్న దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన మొగళ్ళపల్లి వారి సత్రానికి సంబంధించిన 8 దుకాణాలను ఆశాఖ సహాయ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 6 న స్వాధీనం చేసుకుని దుకాణాలను సీజ్ చేశారు. స్వర్గీయ మొగళ్ళపల్లి వెంకటసుబ్బయ్య శ్రేష్ఠి ఉదార స్వభావంతో రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణీకులకు, అమెరికన్ ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం సత్రాన్ని నిర్మించారు. అప్పట్లో ఎలాంటి వసతి సౌకర్యాలు లేకపోవడంతో ఈ సత్రం ఎంతో ఉపయోగకరంగా వుండేది. ఈ క్రమంలో నగరం అభివృద్ధి చెందడం, అమెరికన్ ఆసుపత్రి వైద్య సౌకర్యాలు ముగిసిపోవడంతో ఈ సత్రానికి ప్రాధాన్యం తగ్గింది. ఈ సత్రానికి సంబంధించిన పలు దుకాణాలను కొన్నేళ్ళ క్రితం నెలకు రూ.300 లెక్కన అద్దెకు ఇవ్వడం జరిగింది. అయితే దుకాణాలను లీజుకు తీసుకున్నవారు గత 15 ఏళ్ళ నుంచి బాడుగ చెల్లించకపోగా నెలకు రూ.10వేల బాడుగ లెక్కన ఇతరులకు సబ్ లీజుకు ఇవ్వడం జరిగింది. దీంతో దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు 2016లో హైకోర్ట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. 2017లో హైకోర్టు దేవాదాయ శాఖకు అనుకూలంగా తీర్పు ఇవ్వగా, లీజుదారులు కోర్టుకు వెళ్ళి స్టే తెచ్చుకున్నారు. ఈ క్రమంలో కోర్టు 3నెలల్లోగా అద్దె బకాయిల మొత్తాన్ని చెల్లించాలని తీర్పు ఇవ్వడం జరిగింది. 6 నెలలు గడిచినా దుకాణాదారులు అద్దె చెల్లించకపోవడంతో దేవాదాయ శాఖ అధికారులు కోర్టుకు వెళ్ళగా అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగింది. దీంతో దుకాణాదారులకు నోటీసులు అందించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఈనెల 6న రెవిన్యూ, పోలీసు అధికారుల సహకారంతో 8 దుకాణాల్లోని వస్తు సామగ్రిని బయటకు తరలించి దుకాణాలను సీజ్ చేశారు. పోలీసు శాఖ డీఎస్పీ, సీఐ, విద్యుత్ శాఖ, రెవిన్యూ శాఖ అధికారులు దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారులు కోవూరు జనార్ధన్‌రెడ్డి, వేమూరి గోపి, ఆరంబాకం వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, దేవాదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధాని పరుగులో...

# పెద్ద తలకాయలెన్నో...



***ఈ నెల 23వ తేదీ ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి. మధ్యాహ్నానికే కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందన్నది తేలిపోతుంది. దాని తర్వాత రాజకీయ సమీకరణలు శరవేగంగా మారొచ్చు. ఇదంతా కూడా కేంద్రంలో బీజేపీకి లేదా ఎన్డీఏకు 272 సీట్లు దాటకుంటేనే!***

ఎన్డీఏ 272 సీట్లకు పైన సాధిస్తే ప్రధాని పీఠంపై ఎలాంటి చర్చలుండవు. సందేహాలుండవు. సంప్రదింపులుండవు. ఎన్డీఏ కూటమిని రెండోసారి అధికారంలోకి తెచ్చిన ఘనత ప్రధానిగా నరేంద్ర మోడీ ఖాతాలోనే పడుతుంది. కూటమిని విజయ పంథాలో నడిపినందుకు ప్రధాని పీఠం కూడా ఇంకోసారి ఆయనకే దక్కుతుంది. ఇందులో ఎలాంటి సందేహాలు లేవు. ఒకవేళ ఎన్డీఏకు పూర్తి మెజార్టీకి పది ఇరవై సీట్ల దూరంలో ఆగిపోతే... అప్పుడు ఎన్డీఏ ప్రధానమంత్రి అభ్యర్థిలోనూ మార్పు చోటు చేసుకునే అవకాశముంది. అయితే ఇది కూడా ఎన్డీఏకు మద్దతు పలకడానికి వచ్చే ఏ ఇతర ప్రాంతీయ పార్టీ అయినా కోరుకుంటేనే! అసలు ఎన్డీఏకు మెజార్టీ మార్క్ సీట్లు రాకపోతే ఆ కూటమిలోనే ప్రధాని అభ్యర్థిగా మరో బీజేపీ నాయకుడిని తెరమీదకు తెచ్చే అవకాశాలను కొట్టిపారేయలేము.

ఈమధ్య కొన్ని మాధ్యమాలలో ఎన్డీఏకు పూర్తి మెజార్టీ రాకపోవచ్చని, 10 నుండి 30 సీట్ల దాకా తగ్గొచ్చనే ప్రచారం జరిగింది. ఇది తెలిసినప్పటి నుండి విపక్షాలు అప్రమత్తమయ్యాయి. ప్రధాని రేసులో వున్న పలువురు నాయకులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఫెడరల్ ఫ్రంట్ సారథి కేసీఆర్ అప్పుడే పలు పార్టీల నాయకులను కలవడం ప్రారంభించాడు. కేరళ సీఎం విజయన్‌ను కలిశాడు. డిఎంకె అధినేత స్టాలిన్‌ను ఆయన కలవాలనుకున్నాడు కాని, కాంగ్రెస్‌తో కలిసి సాగుతున్న తాము మరో ఫ్రంట్‌లో చేరేది లేదని స్టాలిన్ నిర్ద్వందంగా చెప్పడం జరిగింది. ఇప్పటికే వైసిపిని ఫెడరల్ ఫ్రంట్‌లోకి ఆహ్వానించిన కేసీఆర్, గతంలోనే టిఎంసీ అధినేత్రి మమతా బెనర్జీని, ఒడిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను కలిసివున్నాడు. అన్నీ కుదిరి కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం వస్తే ఫెడరల్ ఫ్రంట్ ద్వారా ప్రధాని రేసులో నిలవాలనే ఆశ కేసీఆర్‌లో ఎక్కువుగా వుంది. అందుకే ఆయన వైసిపిని కలుపుకుంటే ఉభయ తెలుగురాష్ట్రాల నుండి దాదాపు 30కిపైగా సీట్లతో రేసులో ముందుండొచ్చని భావిస్తున్నారు.

ప్రధానిగా రాహుల్ కంటే చంద్రబాబే నయమని ఈమధ్య ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ ప్రకటించివున్నాడు. అంటే ఒకరకంగా విపక్షాల ప్రధాని అభ్యర్థిగా ఆయన చంద్రబాబుకు మద్దతు పలికినట్లే! అయితే ఇక్కడ ఆయన సొంత తెలివితేటలు వాడాడు. ఈసారి ఏపిలో తెలుగుదేశంకు పెద్దగా సీట్లు రావనే ఆలోచన ఆయనలో వుంది. ఒకవేళ వచ్చినా ప్రధాని అభ్యర్థిగా చంద్రబాబును మమతా, మాయావతి వంటి వాళ్ళు ఒప్పుకోరు. అలాంటప్పుడు చంద్రబాబు తనకు కాకపోతే ప్రధానిగా తనకు మద్దతుగా వస్తాడనే ఆశ పవార్‌ది. అందుకే చంద్రబాబుతో ఆయన అయితే నీకు... లేకుంటే నాకు అనే బాటలో పోతున్నాడు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ విపక్షాల నుండి ప్రధాని రేసులో బలంగా వున్నారు. ఈ ఎన్నికలలో బెంగాల్ నుండి ఆమె 30కుపైగా సీట్లు సాధిస్తే రేసులో ముందు నిలిచినట్లే! యూపీ పార్టీలైన సమాజ్‌వాదీ ఆ పార్టీ తరపున ములాయం సింగ్ యాదవ్, బహుజన సమాజ్ పార్టీ తరపున మాయావతి ప్రధాని రేసులో వున్నారు. ఈసారి కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు యూపిలో వచ్చే ఫలితాలే కీలకం కావచ్చు. మొత్తం 80 సీట్లున్న యూపిలో 2014లో బీజేపీ 72 సీట్లు గెలుచుకుంది. ఈ సీట్లే బీజేపీకి ఆయువుపట్టు. ఈ ఎన్నికల్లో అన్ని సీట్లు రాకున్నా కనీసం సగం సీట్లైనా గెలవగలిగితేనే కేంద్రంలో బీజేపీ మెజార్టీ మార్క్‌ను దాటగలుగుతుంది. అలా కాకుండా ఇక్కడ ఎస్పీ-బిఎస్పీ కూటమి ప్రభావం బలంగా పనిచేసి ఈ కూటమికి 60కిపైగా సీట్లొస్తే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులోనూ ఈ కూటమి హవానే ఎక్కువుగా వుంటుంది. ప్రధాని అభ్యర్థిగా ఎస్పీ నుండి ములాయంకు, బిఎస్పీ నుండి మాయావతికి ప్రాధాన్యత వుంటుంది.

అయితే ఇంతమంది ప్రాంతీయ పార్టీల నేతలు ప్రధాని రేసులో వున్నారుగాని... కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పేరు మాత్రం ప్రధాని పదవికి బలంగా వినిపించడం లేదు. విపక్షాలలో కాంగ్రెస్‌కే అన్నింటికి మించి ఎక్కువ సీట్లు వచ్చినా కూడా రాహుల్‌కు ప్రధాని ఛాన్స్ వుండకపోవచ్చు. ఆయనకు కూడా ఆ పదవిపై అంతగా ఆశలు లేనట్లున్నాయి.



ఈ నెల 9వ తేదీన కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మాజీముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి పంచమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కళాశాల డైరెక్టర్ డా॥ విజయకుమార్‌రెడ్డి, కార్యక్రమంలో హాజరైన ఆయా విభాగాధిపతులు.



నెల్లూరు మాజీ శాసనసభ్యులు జె.కె.రెడ్డి పెద్దకుమారుడు స్వర్గీయ జక్కా రామ్మోహన్‌రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 6వ తేదీన నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం, ఫలహారాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జె.కె.రెడ్డి, ఆయన సతీమణి శ్రీమతి సులోచనమ్మ, వారి కుటుంబసభ్యులు పాల్గొని రోగులకు ఆహారం పంపిణీ చేశారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com